## మహాశివరాత్రి ఏర్పాట్లపై.. సమీక్షా సమావేశం

**శ్రీశైలంప్రాజెక్టు,జనవరి30,ప్రభాతవార్త**

శ్రీశైలం మహాపుణ్యక్షేత్రంలో ఫిబ్రవరి 19 నుండి మార్చి01 వరకు జరుగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారంనాడు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాస రావు ఆధ్యక్షతన పరిపాలన భవన సమావేశ మందిరంలో దేవస్థానం యూనిట్ అధికారులు,ఇంజనీరింగ్ అధికారులు, పర్యవేక్షకులు మరియు వైధికకమిటితో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఈఓ ఎం.శ్రీనివాస రావు మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు జిల్లా యంత్రాంగ సహాయ సహకారాలతో బ్రహ్మోత్సవాలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు సిబ్బంది అందరు కృషి చేయాలని సూచించారు.ప్రతి ఉధ్యోగి కూడా భక్తుల సౌకర్యాల పట్ల పూర్తి శ్రద్ధవహించాలని అన్నారు.అన్ని విభాగాలు కూడా సమిష్టిగా సమన్వయంతో ఉత్సవ నిర్వహణలో విధులను నిర్వర్తించాలని చెప్పారు.ఆయా కైంకర్యాలన్ని ఎలాంటి లోటు లేకుండా సంప్రదాయబద్ధంగా జరిపించాలన్నారు.ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆలయ విభాగానికి సూచించారు.ముఖ్యంగా క్యూలైన్ల నిర్వహణా పకడ్బందిగా ఉండలన్నారు.అదే విధంగా శివదీక్షా భక్తుల ఏర్పాట్లన్ని కూడా ప్రణాళిక బద్ధంగా ఉండలన్నారు.శివరాత్రి పనులన్ని మరింత వేగంగా చేయలన్నారు. పాదయాత్రతో వచ్చే భక్తుల సౌకర్యార్ధం నాగులూటి, పెద్దచెరువు, బీమునికోలను, కైలాసద్వారం,సాక్షిగణపతి,మొదలైన చోట్ల చేయవలసిన ఏర్పాట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు.ఈక్రమంలోనే క్షేత్రంలో క్యూలైన్ల ఏర్పాటు,మంచీనిటి కోళాయిలు,అన్నప్రసాద వితరణ,పారిశుద్య నిర్వహణా,పార్కింగ్ ఏర్పాట్లు,తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో సమీక్షించారు.ఈ సమావేశంలో డిఈఓ ఆర్.రమణమ్మ,స్వామివార్ల ప్రదానార్చకులు



వీరయ్యస్వామి, అమ్మవారి ఆలయ ప్రదానార్చకులు ఎం.ఉమా నాగేశ్వరశాస్త్రి, మార్కెడేయస్వామి,ఈఈ ఎం.నరసింహారెడ్డి, మురళీకృష్ణ, ప్రజసంబందాల అధికారి టి.శ్రీనివాసరావు, సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు,సహాయ ఇంజనీర్లు సంబందిత సిబ్బంది పాల్గొన్నారు.

## టీకేఆర్ శర్మ నిస్వార్ధ దేశభక్తుడు సమాజ హితాభిలాషి

: కులాలు పోయినప్పుడే దేశంల బాగుపడుతుంది
– రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్



**కర్నూలు విద్య, జనవరి 30, ప్రభాతవార్త:**

భిన్నత్వంలో ఏకత్వం లాంటి భారతీయులందరు ఒకే కుటుంబమని వారిని ఏవరు విడదీయలేరని మాజీ మంత్రి టీజీ వెంకటేష్ పేర్కొన్నారు. గాంధీ వర్ధంతి సందర్బంగా స్వాతంత్ర్య సమరయోధులు టీకె ఆర్ శర్మ శతజయంతి ఉత్సవ సభ క్లస్టర్ విశ్వవిద్యాలయం సాహితీ సదస్సు కర్నూలు సంయుక్త ఆధ్వర్యంలో కెవిఆర్ మహిళా డిగ్రీ కళాశాల భనంలో గురు వారం నిర్వహించారు. డాక్టర్ ప్రకాశం పంతులు, పివి నరసింహారావు, టికేఆర్ శర్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి అమరవీరులకు నివాళ్లు అర్పించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయిన టీజీ వెంకటేష్ మాట్లాడుతూ కులవృత్తుల ద్వారా కులాలు వచ్చాయని ఎంతో మేధా సంపత్తి ఉన్నవారికి కూడ కులం అంటగట్టడం భావ్యం కాదన్నారు. విద్యార్థులు కులమాతాలకు అతీతంగా అభివృద్ధి చెంది సమాజహితానికి పాటుపడాలని సూచించారు. క్లస్టర్ విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య డివిఆర్ సాయిగోపాల్ మాట్లాడుతూ టీకేఆర్ శర్మగారి శతజయంతి ఉత్సవం జరుపుకోవడం వారి స్ఫూర్తిని తర్వాత తరాలకు అందజేయడం కోసమే అన్నారు. సభాధ్యక్షుడు కూరాడి చంద్రశేఖర్ కల్కూర మాట్లాడుతూ మహాత్ముడు అంటే మహాశక్తి ఆయన ఒక వ్యవస్థ అన్నారు. ప్రిన్సిపాల్ వివిఎస్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎన్నో పోరాటాలు జరిగాయని అవి అన్ని ఆయుదాలు, మందుగుండు సామాగ్రితో జరిగితే శాంతి అహింస ద్వారా స్వాతంత్ర్యాన్ని సాధించిన వ్యక్తి మహాత్మగాంధీ అన్నారు. అనంతరం మాట్లాడిన వక్తలు ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశయాలను, నెరవేర్చేందుకు గాంధీవలే చక్కటి క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జేఎస్ఆర్కే శర్మ, సుబ్బలక్ష్మీ, హెచ్కే మనోహార్, జివిఎస్ మూర్తిరెడ్డి, కేజి గంగాధర్‌రెడ్డి, జయప్రకాష్, యలమర్తి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇష్టారాజ్యంగా.. నర్సింగ్ పరీక్షలు..!

- ప్రాక్టికల్స్ హాలులో ప్రైవేటు వ్యక్తులు
- తప్పులను సమర్థించుకోవడమే తప్పా.. బాధ్యత వహించడం లేదు
- అంతా మా ఇష్టం అంటున్న నిర్వాహకులు
- ప్రైవేట్ నర్సింగ్ పాఠశాలల ప్రలోభాలు



పరీక్ష హాల్లో ప్రైవేటు వ్యక్తులు విద్యార్థుల పక్కనుండి పరీక్షలు రాయించారు... అందుకు సంబంధించిన వీడియోలు బయటకు వచ్చాయి... అది తప్పు కాదని... తప్పు ఉన్నా మాకు సంబంధం లేదని బుకాయించడం కర్నూలు నర్సింగ్ స్కూల్ యాజమాన్యానికి... కర్నూలు జనరల్ హాస్పిటల్ నిర్వాహకులకే చెల్లింది.... స్వార్ధ ప్రయోజనాలతో ఇలా కొందరు విద్యార్థులకు సహకరిస్తే... వాస్తవంగా కష్టపడి చదివిన విద్యార్థులు వెనుకబడిపోతారు .. ఇది విద్యా వ్యవస్థకు తీరని అన్యాయం... ప్రైవేటు వ్యక్తులను ప్రాక్టికల్స్ జరిగే పరీక్ష హాల్లోకి అనుమతించడంలో అవినీతి ఉందా... నిర్లక్ష్యం ఉందా.. అసలు అందుకు బాధ్యులు ఎవరు... విషయం వెలుగులోకి వచ్చి వారం రోజులు కావస్తున్న కనీస విచారణ ప్రారంభం కాకపోవడం శోచనీయం... ఇది జిల్లా యంత్రాంగం పనితీరుకు దర్పణం.

**కర్నూలు,ప్రభాతవార్త :**

కర్నూలు జిల్లా కేంద్రంలో నర్సింగ్ విద్యార్థుల వార్షిక పరీక్షలు జరుగుతున్నాయి. ఇందులో అధికారులు ఎవరికి వారు తమ తప్పు లేదంటే తమ తప్పు లేదంటూ... జరుగుతున్న అక్రమాలను అలాగే కొనసాగిస్తున్నారు. అక్రమాలు ఆపాలనే ఉద్దేశం అధికారులలో ఇసుమంత కూడా కనిపించడం లేదు. పరీక్షలలో జరిగిన అక్రమాలకు నర్సింగ్ కళాశాలల ప్రమేయం ఉందనే వాదన వినిపిస్తోంది. ఎవరి ప్రమేయం ఉన్నా లేకపోయినా.. అక్రమాలు లేకుండా పరీక్షలు నిర్వహించాల్సింది మాత్రం హాస్పిటల్ సూపరింటెండెంట్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్. కానీ అక్రమాలు జరుగు తున్నాయంటే వారిద్దరి వైఫల్యం అని చెప్పాల్సిన అవసరం లేదు. అందులో ప్రధానంగా జరిగిన లోపాలు ఇలా ఉన్నాయి. సాధారణంగా థియరీ పరీక్షలు తొమ్మిది గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా సుమారు గంట ఆలస్యంగా పేపర్లు ఇచ్చి పరీక్షలు నిర్వహించారు. సదరు క్వశ్చన్ పేపర్ బయటకు వెళ్లిందని విమర్శలు వచ్చాయి. ఆ విషయం మీడియాలో వార్తలు వచ్చినప్పటికీ... ఎలాంటి మార్పు లేకుండా అలాగే పూర్తి చేశారు. ప్రాక్టికల్స్ నిర్వహణ మరీ దారుణంగా జరిపించారు. ప్రాక్టికల్స్ ప్రభుత్వ నర్సింగ్ స్కూల్ కేంద్రంగా జరిపారు. ప్రభుత్వ నర్సింగ్ స్కూల్లో ఉదయం ప్రాక్టికల్స్ టాపిక్‌తో ఆన్సర్ షీట్లు ఇచ్చి ఆసుపత్రిలోని వివిధ వార్డులకు విద్యార్థులను పంపించారు. అక్కడ ప్రాక్టికల్స్ విషయంలో సరైన పర్యవేక్షణ లేకపోవడం గమనార్హం. సరే పర్యవేక్షణ లేదంటే సిబ్బంది కొరత కారణం అనుకో వచ్చు. ప్రైవేట్ కళాశాల విద్యార్థులు ప్రాక్టికల్స్ నిర్వహించే వార్డులలో అదే ప్రైవేట్ కళాశాలలో పనిచేసిన టీచింగ్ స్టాఫ్ ఉంటూ ప్రాక్టికల్స్ చేయించారు.



• వివరాలు 2లో

## పశు సంపద ఆవాసాలకు స్థలాలను అన్వేషించండి

: జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల, జనవరి 30,ప్రభాతవార్త ప్రతినిధి:**

జంతువుల ఆశ్రయ నివాసాలకు స్థలాలను అన్వేషించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి కమిటీ సభ్యులను, సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జంతువుల పట్ల క్రూరత్వానికి నిరోధించు సొసైటీ సభ్యులతో సమావేశం జరిగింది. జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. బి. గోవింద నాయక్, ఇతర అధికారిక సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పశు సంపద ఆశ్రయ నిమిత్తం సలాలను గుర్తించాలని కమిటీ సభ్యులను, సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉన్న వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ లు చేయించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పశువుల సంతల వివరాలు అడిగి తెలుసుకుంటూ జిల్లాలో పశు సంపద అక్రమ రవాణాపై నిఘా పెట్టాలన్నారు. పశు సంపద పరిరక్షణపై కమిటీ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అన్ని మున్సిపాలిటీలో రోడ్లపై తిరిగే పశువుల నియంత్రణకు మున్సిపల్ కమిషనర్ లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇటీవల బనగానపల్లె పట్టణంలో వీధి పశువులను చేపట్టిన అంశాలను కలెక్టర్ వివరించారు.



## ఆర్టీసీ బస్టాండ్ డ్రైనేజీని ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి

**బనగానపల్లెరూరల్, జనవరి30, ప్రభాతవార్త:**

బనగానపల్లె పట్టణంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో గల డ్రైనేజీ వ్యవస్థను రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల డ్రైనేజీ కాలువ చెత్తాచెదారంతో పేరుకుపోయి డ్రైనేజీ వ్యవస్థ నిలిచిపోవడం పై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ప్లాస్టిక్ రహిత బనగానపల్లె లక్ష్యంగా ఒక వైపు ప్రజలను చైతన్యపరుస్తుంటే డ్రైనేజీ వ్యవస్థ చెత్తాచెదారంతో నిలిచిపోవడం పై మంత్రి పంచాయతీ అధికారుల పై మండిపడ్డారు. తక్షణమే డ్రైనేజీ కాలువలోని చెత్తాచెదారాన్ని తొలగించాలని మంత్రి ఆదేశించారు. అదే విధంగా సాయంకాలానికి డ్రైనేజీ కాలువను పరిశుభ్రంగా మార్చి తనకు ప్రత్యేకంగా ఫోటో తీసి పంపాలని పంచాయతీ అధికారులకు మంత్రి సూచించారు. తదనంతరం బనగానపల్లె పట్టణంలోని ఆర్అండ్‌బీ రోడ్డు డివైడర్ పై చెత్తను తొలగించి మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఈవో సతీష్ కుమార్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది, తేదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

– హెల్మెట్ ధరించండి... ప్రాణం నిలుపుకోండి
– డీయస్పీ ఎం.హేమలత



**ఆదోనిటౌన్, జనవరి30, ప్రభాతవార్త;**

ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, టూవీలర్ వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణం నిలుపుకోవాలని ఆదోని డీయస్పీ ఎం.హేమలత సూచించారు. ఈ మేరకు గురువారం జాతీయ రహదారి భద్రత మహోత్సవాలు–2025లో భాగంగా ఆటోల ద్వారా ఆర్టీసీ బస్టాండు నుంచి పోలీసు కంట్రోల్ రూమ్, భీమా సర్కిల్, గవర్నమెర్ ఆసుపత్రి మీదుగా, ఆర్టీసీ బస్టాండు వరకు ఆటో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డీయస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీయస్పీ మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలను సక్రమంగా పాటించడం వల్ల ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగవన్నారు. టూవీలర్ వాహనదారులు ప్రయాణించే సమయంలో హెల్మెట్ వాడడం వల్ల ప్రమాదం జరిగినప్పుడు తలకు ఎలాంటి గాయాలు కాకుండా కాపాడుతుందన్నారు. అలాగే కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలన్నారు. రోడ్లపై వేగంగా వెళ్లకుండా నెమ్మదిగా వెళ్లాలన్నారు. ప్రతొక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించడంలో ముఖ్య పాత్ర పోషించాలని, ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు, టూటౌన్ సీఐ సూర్యమోహన్‌రావు, రూరల్ సీఐ నల్లప్ప, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి గురువారం ఈ స్వచ్ఛసేవా కార్యక్రమం

**శ్రీశైలంప్రాజెక్టు,జనవరి30,ప్రభాతవార్త**

శ్రీశైలక్షేత్రంలో ప్రతి గురువారంనాడు పారిశుధ్య స్వచ్ఛసేవా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని శ్రీశైలదేవస్థానం ఈఓ ఎం.శ్రీనివాసరావు అన్నారు.క్షేత్రంలో ఆయా ప్రాంతాల్లో విస్తృత పారిశుద్య చర్యలు అదికారులతో కలసి చేయడం జరిగింది. ఈఓ మాట్లాడుతూ స్వచ్ఛ శ్రీశైలం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు బాగస్వాములు కావాలని కోరారు.స్థానికులందరు కూడా చెత్తాచెదారాలను నిర్ధేశించిన చెత్త బుట్టలలో మాత్రమే వేయాలనా న్నరు.అన్ని విబాగాల సిబ్బంది కూడా ఈ ప్రత్యేక విధుల్లో పాల్గోనాలన్నారు.కాగా పారిశుధ్య నిర్వహణకుగాను క్షేత్రాన్ని 6జోన్లుగా,11 సెక్టార్లుగా,66 ప్రదేశాలుగా విభజించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఈఓ ఆర్.రమణమ్మ, ఈఈ,ఏఈఓలు, పర్యవేక్షకులు, సిబ్బంది,పాల్గోన్నారు.

## మరో బాసర.. కొలనుభారతి క్షేత్రం..!

- రాష్ట్రంలో ఏకైక సరస్వతి ఆలయం
- ఫిబ్రవరి 2న వసంతపంచమి

**కొత్తపల్లె, జనవరి 30, ప్రభాతవార్త:**

దట్టమైన నల్లమల అడవిప్రాంతంలో ఎతైన కొండల మధ్య చారుఘోషిని నది ఒడ్డున సరస్వతీ దేవి కొలువయ్యారు. చారఘోషిని నది ఏడాది పొడువునా ప్రవస్తుండడం విశేషం. అమ్మవారు స్వయంబుగా పుస్తకారిణి రూపంలో దర్శనమిస్తున్నారు. 11వ శాతాబ్దిదానికి చెందిన నల్ల భూపతి అనే చాణిక్యరాజు నిర్మించినట్టు శిలాశాసనాలను బట్టి తెలుస్తోంది. చదవుల తల్లి సరస్వతీదేవి అమ్మవారి పుట్టిన రోజున వసంత పంచమి జరుపుకోవడం అనవాయితీగా వస్తుంది. సరస్వతీదేవిని వేదమాతగా భారతిదేవిగా నాగేశ్వరీగా శారదాగా మన పూర్వీకులు వివరిస్తారు. ఇంతటి సర్వశక్తిమయమైన కొలనుభారతి



అమ్మవారిని నెలస్వరూపినిగా భావిస్తారు. కొలనుభారతి క్షేత్రంలో విద్యాభ్యాసం వసంతపంచమి రోజు ఘనంగా నిర్వహిస్తారు. రాష్ట్రంలో ఏకైక సరస్వతీక్షేత్రం కొలనుభారతి అతిపూరాతనమైన ఆలయం. రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రంలో ఏకైక సరస్వతీ క్షేత్రం. క్షేత్రపాశత్యం ఆధ్యాత్మిక విశిష్ట చరిత్రను బట్టి బాసర సరస్వతీ దేవస్థానం కన్నా పురాతన దేవాలయంగా చరిత్రకారులు భావిస్తారు. ఇక్కడ అమ్మవారు స్వయంబుగా



పుస్తకాధారిణి రూపంలో దర్శ మిస్తుంది. అమ్మవారి మూల వీరాట్ ఎదుట శ్రీచక్రం ఉటుంది. నాలుగు చేతులు కలిగిన దేవి ఉత్తరముఖంగా దర్శనమిస్తు న్నారు. కుడివైపు రెండు చేతుల్లో పాశం అభయహస్తం, ఎడమవైపు రెండుచేతుల్లో పుస్తకం అంకుశం కనిపిస్తాయి.

**ఛారుఘోషిని నది ప్రవాహం:** నల్లమల ఎతైన కొండల నడుమ రాతిపొరల నుంచి నిత్యం సుదూరంగా ప్రవహిస్తు వస్తున్న చారుఘోషిని నది ప్రవాహం అమ్మవారి పాదసన్నిధిలో ఇంకిపోయే దృశ్యం ఇక్కడ చూడవచ్చు. ఈనది ప్రవాహంలో స్నానం అచరించి కొలనుభారతిదేవిని దర్శించుకుంటే సకల పాపాలు హరించుకుపోతాయని ఆలయ సంప్రోక్షణకు భక్తులు స్నానం అచరించేందుకు ఛారుఘోషిని నది.

**ఆలయ అవరణలో సప్తశివాలయాలు:** ఆలయ అవరణలో సప్త శివాలయాలు ఉన్నాయి. ఈశివాలయాల్లో ఒక ఆలయం తూర్పుముఖంగా, మిగిలిన మూడు ఆలయాలు దక్షిణంవైపు, మూడు ఆలయాలు ఉత్తరం వైపు ఉన్నాయి. అన్ని ఆలయాలకు ఒకేధ్వజస్థంభం ఉండడం విశేషం. ఇలా చేరుకోవచ్చు: ఈక్షేత్రానికి చేరుకునేందుకు ఆత్మకూరు నుంచి కపిలేశ్వరం బస్సు ఎక్కి శివపురం గ్రామానికి చేరుకోవచ్చు. శివపురం నుంచి ఐదు కిలోమీటరల ఆటవీమార్గం ద్వారా ఆటోలో లేదా నడిచి కొలనుభారతి క్షేత్రం చేరుకోవచ్చు. వసంత పంచమి సందర్భంగా క్షేత్రానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తారు.



## రిజిస్ట్రేషన్ మోత.. క్రయ.. విక్రయదారులకు వాత..!

: రేపటి నుంచి రిజిస్ట్రేషన్‌ల ఛార్జీలు పెంపు..
: 15 నుంచి 20 శాతం వరకు పెరిగే అవకాశం..
: ప్రజల అభ్యంతరాలు, సలహాలు తరువాతే.. ఈ ప్రక్రియ అంటున్న ప్రభుత్వం..
: రిజిస్ట్రేషన్‌కు మొరాయిస్తున్న సర్వర్..



**కోసిగి, జనవరి 30, ప్రభాతవార్త**

"పూర్తిస్థాయి అధ్యయనం చేసిన తరువాత ఫిబ్రవరి 1 నుంచి రిజిస్ట్రేషన్ కొత్త ఛార్జీలు అమలు చేసేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది.. దీంతోరాష్ట్ర వ్యాప్తంగా రేపటి నుంచి క్రయ, విక్రయదారులు భూములు కొన్నా, లేక అమ్మినా రిజిస్ట్రేషన్ ఛార్జీల మోత పడనుంది.. సాధారణంగా15 నుంచి 20 శాతం వరకు ఈ రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచవచ్చని అభిప్రాయ పడుతున్నారు.. అయితే జనవరి 2025 నుంచే ఈ రిజిస్ట్రేషన్‌ఛార్జీలు పెంచాలని మొదట ప్రభుత్వం నిర్ణయించినా తర్వాత పలు కారణాలతో ఈ పెంపును ప్రభుత్వం వాయిదా వేసింది.. అయితే ఇప్పటికే ప్రజాభిప్రాయ సేకరణతో అభ్యంతరాలు, సలహాలు, సూచనలు స్వీకరించారు.. కాగా ప్రభుత్వం గ్రోత్ కారిడార్లలో రిజిస్ట్రేషన్ విలువలు పెంచుతున్నట్లు కూడా ప్రకటించింది.. దీంతో ఫిబ్రవరి 1వ తేది అనగా శనివారం నుంచి ఇవి అమలులోకి రానున్నాయి".. భూముల రిజిస్ట్రేషన్ విలువలను సవరించడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలనే రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది.. ఆ దిశగా వేగంగా అడుగులేస్తోంది.. దీంతో ఫిబ్రవరి 1 నుంచి కొత్త రిజిస్ట్రేషన్‌ల ఛార్జీలు అమలు చేయాలని నిర్ణయించింది.. ఈ పెంపుదల అనేదిసాధారణంగా 15 నుంచి 20 శాతం మధ్య ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది.. అయితే ఈ రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపును వాస్తవానికిజనవరి 1 నుంచే అమలు చేయాలని మొదట భావించింది.. ఈ మేరకు అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లు ఈ కొత్త ధరలను ప్రతిపాధించిప్రజాభిప్రాయం సేకరించాలని రెవిన్యూ శాఖ ఆదేశించింది. విలువలు సవరణ ప్రతిపాదనలకు జిల్లా కమిటీల ఆమోదం తెలిపిన తరువాత2024 డిసెంబరు 20నే సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాల నోటీసు బోర్డులల్లోఈ ప్రతిపాదించిన కొత్త ధరలు ప్రజలకు అందుబాటులో ఉంచారు.. డిసెంబరు 24 వరకు అభ్యంతరాలు, సలహాలు, సూచనలు స్వీకరించాలని, అభ్యంతరాల పరిశీలన అదే నెల 27వ తేదీ వరకుజరుగుతుందని ప్రభుత్వం ఇది వరకే ప్రకటించింది..ఆ మేరకు ప్రక్రియ పూర్తి చేసారు.. వాస్తవానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భూములకున్న డిమాండ్‌ను, ప్రస్తుతం ఉన్న ధరలను పరిశీలించి కొత్త ధరలను ముసాయిదాలు తయారు చేయాలని రెండు వారాల క్రితమేప్రభుత్వం జిల్లా కలెక్టర్‌లను ఆదేశించింది.. ఈ నిర్ణయంపై ప్రజలతో పాటు ప్రభుత్వ వర్గాల నుంచి వచ్చిన సూచనలతో మార్కెట్ ధరలపెంపు నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వం వెనుకడుగు వేసినట్లు తెలుస్తోంది.. కర్నూలు వంటి జిల్లా కేంద్రంతో పాటు ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు వంటి పట్టణ ప్రాంతాల్లో కూడా ఈ ధరలు అమాంతంగా పెరిగాయి.. వైసీపీ హయంలో రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపుదలను టీడీపీ వ్యతిరేకించింది.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకివచ్చింది.. రాష్ట్ర ఖజానాకు ఆదాయాన్న పెంచుకోడానికి భూముల రిజిస్ట్రేషన్‌ల ఛార్జీలను పెంచాలని ప్రభుత్వ పెద్దలు ప్రతిపాదించారు.. భూముల ధరలు పెరిగితే రిజిస్ట్రేషన్‌లు ద్వారా ఏటా వేల కోట్ల ఆదాయం వస్తుందని అందుకు అనుమతించాలని ఆర్థికశాఖ, రెవిన్యూశాఖలఅధికారులు ప్రతిపాదించారు.. అయితే రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపుదల అమలులోకి రాకముందే గత రెండు నెలలుగా ప్రభుత్వ నిర్ణయంతో ప్రజల్లో చర్చ మొదలైంది..

**ఫిబ్రవరి 1 నుంచి కొత్త రిజిస్ట్రేషన్‌ల ఛార్జీలు:** కాగా రిజిస్ట్రేషన్ ఛార్జీలను ఈ ఏడాది జనవరి నెల నుంచే పెంచాలనే నిర్ణయంతో ప్రజల్లో ఆందోళన నెలకుంది.. దీంతో అంశంపై సమగ్రంగా చర్చించిన తరువాతే తుది నిర్ణయం తీసుకోవాలని ముఖ్య మంత్రి చంద్రబాబునాయుదు నిర్ణయించారు.. దీంతో చివరి నిమిషంలో రిజిస్ట్రేషన్‌ఛార్జీల పెంపు వాయిదా పడింది.. దీనిని సుదీర్ఘ కసరత్తు తర్వాత ఫిబ్రవరి 1 నుంచి రిజిస్ట్రేషన్‌ల ఛార్జీలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది..ఇందుకు గానూ ఆయా ప్రాంతాల అభివృద్ధి, ఇతర అంశాల ప్రతిపాదికగా ప్రస్తుతం ఉన్న దానిపై సుమారు 15 నుంచి 20 శాతం మేరకువిలువలు పెరిగే అవకాశం ఉంది.. ఖాళీ భూములతో పాటు ప్లాట్లు, నిర్మాణ ప్లాట్లు ధరలు పెరగవచ్చని తెలుస్తోంది.. ఈ మేరకు ప్రభుత్వంకూడా గెజిట్‌ను ప్రకటించింది..

**రిజిస్ట్రేషన్‌లకు మొరాయిస్తున్న సర్వర్:** రేపటి నుండి భూములు కొన్నా, లేక అమ్మినా రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరుగుతున్న నేపథ్యంలో ముందుగానే క్రయ, విక్రయదారులు రిజిస్ట్రార్‌కార్యాలయాల ముందు బారులు తీరుతున్నారు..అయితే ప్రభుత్వం ఆదాయం కోల్పోతుందనే సర్వర్‌లను సక్రమంగా ఉంచడం లేదు..దీంతోరిజిస్ట్రేషన్‌లు చేసుకునేందుకు వచ్చిన వారు సర్వర్ మొరాయిస్తుండడంతో రిజిస్ట్రేషన్‌లు చేసుకోలేకపోతున్నారు..కారణంలో ఒక్కరోజు నిలుపుదలచేస్తే పెంచిన రిజిస్ట్రేషన్ ఛార్జీలు అమలు అవుతాయని ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని తెలుస్తోంది..

## ప్రగతి పద్దులకు పచ్చజెండా..!

– నగరపాలక సంస్థ 2025–26 ఆర్థికసంవత్సర బడ్జెట్ అమోదం
– సమస్యలపై పాలకవర్గం సుదీర్గ చర్చ



**కర్నూలు మున్సిపల్, జనవరి 30, ప్రభాతవార్త:**

కర్నూలు నగర పాలక సంస్థ 2025–26 ఆర్థికసంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను పాలకవర్గం అమోదించింది. రూ.291.67 కోట్లతో అధికారులు ప్రతిపాదిత బడ్జెట్ ప్రవేశపెట్టగా కార్పొరేటర్ల పలు సందేహాలకు వ్యక్తం చేశారు. గురువారం నగర పాలక కౌన్సిల్ హాల్‌లో మేయర్ బి వై రామయ్య అద్యక్షతన బడ్జెట్ సాధారణ సమావేశం నిర్వహించారు. తొలుత జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా రెండునిమిషాలు మౌనం పాటించారు. అనంతరం బడ్జెట్ అంశాలను అధికారులు చదివి వినిపించారు. మొత్తం ఆదాయం రూ.363.99 కోట్లు, ఖర్చు 291.67 కోట్లు,రెవిన్యూ ఆదాయం 201.22 కోట్లు, ప్రభుత్వ గ్రాంట్లు రూ.162.77 కోట్లు, మూలధన రాబడి రూ.138.69 కోట్లు, నికర మిగులు రూ.72.31 కోట్లుగా అంచనా వ్యయం చూపించారు. అనంతరం సాధారణ సమావేశం నిర్వహించి 17 అంశాలపై చర్చించి అమోదం తెలిపారు. రూ.6.79 కోట్లతో వివిద అభివృద్ధి పనుల కేటాయింపునకు పచ్చజెండా ఊపారు. కార్పొరేటర్లు లేవనెత్తిన సమస్యలకు కమిషనర్ ఎస్ రవీంద్రబాబు సమాధానం ఇచ్చారు. కూడల్లో బ్యానర్లు నిషేదిస్తామని ఏర్పాటుచేసేవారిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. మహనీయులను అందరు గౌరవించాలని వారి విగ్రహాలను కనబడకుండా ఫ్లెక్సిలు ఏర్పాటుచేయడం సరికాదన్నారు. పైగా దానివల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు.

**అమోదించిన తీర్మాణాలు:** 15వ ఆర్థికసంఘం 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంవత్సరానికి సంబంధించిన రెండవ విడత నిధులు రూ,15,60,12,349ల వినియోగానికి సంబందించి జరిగిన పనులను ధృవీకరించారు. 15వ ఆర్థిక సంఘం 2023–24వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.16,23,57,967లతో 15 రకాల అభివృద్ధి పనులనుచేపట్టుటకు రూపొందించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపడానికి ఆమోదం తెలిపారు. 35వ వార్డు ఉమా మహేశ్వర నగర్ రూ.42 లక్షలతో రహదారి నిర్మాణానికి అమోదం తెలిపారు. 34వ వార్డు నిర్మల్ నగర్ నందు ఈఎల్ఎస్ఆర్ ట్యాంకు చుట్టు కాంపౌండ్ వాల్ నిర్మించడానికి రూ.27 లక్షలు మంజూరు చేశారు. 19వ వార్డు నాజర్ కాలనీ మల్లికార్జున నగర్ నందు రూ.33 లక్షలతో డిస్పోజబుల్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.33 లక్షలు మంజూరు చేశారు. సమావేశంలో మరికొన్ని తీర్మాణాలను అమోదించారు.

## ఇష్టారాజ్యంగా.. నర్సింగ్ పరీక్షలు..!

(మొదటి పేజీ తరువాయి ) :

ఇక్కడ ప్రభుత్వ నర్సింగ్ స్కూలుకు సంబంధించిన ఒక పర్యవేక్షకులు ఉండగా సదరు ప్రైవేట్ స్కూలుకు సంబంధించి సీనియర్ విద్యార్థులు ముగ్గురు, ఒక టీచింగ్ స్టాఫ్ ప్రాక్టికల్స్ సమయంలో విద్యార్థులకు అండగా ఉండి చేయించారు. ఈ విషయాలు వీడియోలతో సహా సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ కు మీడియా వారు అందించారు. అయితే ఆమె ఆ విషయంలో ఆమె చెప్పిన సమాధానం మరి వింతగా ఉంది. అయితే ప్రాక్టికల్స్ సమయంలో ప్రైవేటు కళాశాలల టీచింగ్ స్టాఫ్ ఎందుకు ఉన్నారు అనే విషయంపై ఆమె వివరణ ఇస్తూ. ఒక విద్యార్థిని హాల్ టికెట్ మర్చిపోతే తీసుకుని వచ్చి ఇచ్చేందుకు ప్రైవేట్ స్కూల్ టీచర్ వచ్చారని చెప్పారు. ప్రాక్టికల్స్ లో ఎందుకు సహకరించారు అంటే సరైన సమాధానం ఇవ్వకపోగా. తాను సిన్సియర్ అని తాను ఎలాంటి అక్రమాలు చేయలేదని చెబుతారు. ఇక్కడ సిన్సియారిటీ, అక్రమాలు అనే విషయం పక్కన పెడితే పరీక్షలకు నిర్వహణలో అధికారులు ఫెయిల్యూర్ అనేది స్పష్టంగా తెలిసిపోతుంది. నర్సింగ్ పరీక్షల ప్రాక్టికల్స్ హాలులో ప్రైవేట్ పాఠశాలల టీచర్లు విద్యార్థులకు సహకరించడం తప్పు అనడంలో సందేహం లేదు. ఇది నూటికి నూరుపాళ్ళు నిర్వహణలోపం. మరి నిర్వహణ లోపానికి సంబంధించిన బాధ్యత ఎవరు తీసుకుం టారంటే అంతా మా ఇష్టం.. మమ్మల్ని అడిగేది ఎవరు అంటారు. ఇదే విషయంలో ఆసుపత్రి సూపరిండెంట్ కనీసం మీడియాకు అందుబాటులోకి కూడా రాకపోవడం గమనార్హం. ఫోన్ చేస్తే స్పందించలేదు. ఆయన సీసీ కి సమాచారం చెపితే స్పందించలేదు. పీఆర్వోకు సమాచారం చెబితే స్పందించలేదు. పరీక్షల నిర్వహణ చేతకాదని ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తే వారు అధికారులను మార్చడమా లేక పరీక్ష కేంద్రాలను మరో ప్రాంతానికి మార్చి పరీక్షలు సక్రమంగా నిర్వహిస్తారనే డిమాండ్ వినిపిస్తోంది.

## తూతూమంత్రంగా సాగిన మండల సర్వసభ్య సమావేశం



**హొళగుంద, జనవరి 30, ప్రభాతవార్త:** మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి నూర్జహాన్‌బీ అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింద జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతులు,ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు తదితర అంశాలపై ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే సర్వసభ్య సమావేశం ఎంపిడిఓ కార్యాలయంలో జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ కురువ బొజ్జమ్మ,ఎంపిడిఓ విజయలలిత, ఈఓపిఆర్‌డి చక్రవర్తిల ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం ఆలస్యంగా 11.30గంటలు దాటిన కూడా నామమాత్రంగా సాగింది. ప్రజాప్రతినిధులు, అధికారులు కొంతమంది రాకపోయినా వచ్చిన వారితోనే సమావేశాన్ని తూతూమంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకున్నారు. మండల సర్వసభ్య సమావేశానికి విద్యుత్ శాఖ,ఆర్‌అండ్‌బి అధికారులు గైర్హాజరయ్యారు. ప్రజల సమస్యలను వివరించే వారు లేరని, అధికారులు ఆడిందే ఆటగా..పాడిందే పాటగా..మారిందని ప్రజలు వాపోతున్నారు. మండల సర్వసభ్య సమావేశంలో మండల సమస్యలపై కానీ అభివృద్ధిపై కానీ సమగ్రంగా చర్చ జరిగిన దాఖలాలు లేవని వాపోతున్నారు. మండలంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరిగినవి,జరుగుతున్నాయో మండల ప్రజలకు తెలియదు. అంతేకాకుండ గత సమావేశంలో ప్రజాప్రతినిధుల నుండి వచ్చిన అభ్యర్థనలో పరిశీలన మరియు వాటి పనితీరు వివరాలు కూడా అధికారులు తెలపలేదు. స్థానికంగా మండలంలోని సులువాయి,ఇంగళదహాల్ పాఠశాలలను స్కూల్ కాంప్లెక్స్‌గా కేటాయించాలని ఆ గ్రామస్తులలో సులువాయి రాఘవేంద్రచౌదరి,ఎండిహళ్లి సర్పంచ్ సుధాకర్‌లు మండల విద్యాధికారి జగన్నాథంకు వినతిపత్రాన్ని సమర్పించారు. అదేవిధంగా తమ గ్రామానికి వచ్చిన స్కూల్ కాంప్లెక్స్‌లో తొలగించరాదని కూడా ఎల్లార్తి గ్రామ సర్పంచ్ కురువ చాముండేశ్వరి,యువ నాయకుడు దర్గన్నలు అధికారులకు విన్నవించారు. అనంతరం సమ్మతగేరి గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని మరొక ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని సమ్మతగేరి సర్పంచ్ తప్పెట శోభ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. మండల కేంద్రంలోని హొళగుంద ఎస్ఎస్ ట్యాంక్ గత ఏడాది నీటి నిల్వ ఎక్కువగా ఉండడంతో ట్యాంకు గట్టు గతంలోనే కుంగిపోయిందని వాటి మరమత్తులు చేపట్టి రాబోయే వేసవికి దాహార్తిని తీర్చాలని కోరగా ప్రభుత్వానికి నివేదిక పంపామని నిధులు మంజూరై ఆదేశాలు వస్తే తప్పకుండ నిర్మాణ పనుల్లో త్వరితగతిన పూర్తి చేస్తామని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రామ్‌లీలా అన్నారు. పొదుపు మహిళా సమాఖ్య ద్వారా మహిళల సర్వోన్నతాభివృద్ధి కోసం బ్యాంకుల ద్వారా రుణాలు అందించి వారికి సాయం ప్రతినిధల నుండి వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించాలని ఎంపిడిఓ విజయలలిత,ఈఓపిఆర్‌డి చక్రవర్తిలు ఆయా శాఖల అధికారులకు సూచించారు. అలాగే అధికారుల మరియు ప్రజాప్రతినిధుల అరకొర సమావేశంతో సర్వసభ్య సమావేశం ప్రతిసారి మాదిరిగానే నామమాత్రంగానే జరిగింది. మండల సర్వసభ్య సమావేశంలో కొందరు అధికారులు మాత్రమే సమావేశం ఏర్పాటు చేసుకొని వారు మాత్రమే నామమాత్రంగా వివరాలు చెప్పుకొని 2గంటల సమయంలోనే సమావేశం ముగించుకుంటున్న పరిస్థితులు మండలంలో నెలకొన్నాయి. ఇప్పటివరకు జరిగిన సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మాణాలు అవి అమలు అయిన తీరు ఎవరికి తెలియవు. ఈ సమావేశంలో సమస్యలపై చర్చకు దారి తీసే నాయకులే మండలంలో కరువయ్యారు. దీంతో మండలంలో అభివృద్ధి ఎక్కడ జరుగుతుందో ఎవరికి తెలిసే పరిస్థితి లేదు. కావున ఇప్పటికైనా మండల సర్వసభ్య సమావేశాన్ని పటిష్టంగా ఏర్పాటు చేసి మండలంలో వివిధ శాఖలు పనిచేస్తున్న తీరు,వాటి అభివృద్ధి,వచ్చిన నిధులపై సమగ్రమైన చర్చజరగాలని ప్రజలు కోరుకుంటున్నారు. కొన్ని శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడంతో పలువురు ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఏఈ యమునప్ప,హౌసింగ్ ఏఈ రవివర్మ,ఉపాధి ఏపీఓ భక్తవత్సల్యం,ఎంఏఓ ఆనంద్,లోకదల్,పంచాయతీ సెక్రటరీలు రాజశేఖర్‌గౌడ్, రాజ్‌కుమార్, రంగస్వామి, సర్పంచ్‌లు చలవాది రంగమ్మ,నాగప్ప నాయుడు, రమేష్, వెంకటొరెడ్డి, ఎంపిటిసిలు శివన్న, మల్లికార్జున, హనుమప్ప, నాయకులు ఈసా,దర్గన్న,ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు,అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ చింతలాముని,నల్లారెడ్డి 35వ ఆరాధనోత్సవం



**ఆస్పరి, జనవరి 30, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తంగరడోన గ్రామంలో కొలిచే వారికి కొంగుబంగారంగా విరజిల్లుతున్న శ్రీశ్రీ చింతలాముని,నల్లారెడ్డి స్వాముల వారి 35వ ఆరాధన మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త పార్వతి, గ్రామపెద్దలు తెలిపారు. గురువారం మాఘశుద్ధ పాడ్యమి 8గంటలకు ప్రాత:కాలపూజ, పంచామృతాభిషేకం, 10గంటలకు రుద్రహోమం,నవగ్రహ వాస్తుహో మములు, 12గంటలకు అష్టదిక్పల్క,కూష్మాండబలి ప్రధానము, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, మహా మంగళారతి, తీర్థప్రసాదాలు అందించారు. ఈ ఆరాధన చుట్టూ పక్కన గ్రామాల ప్రజలే కాకుండ కర్ణాటక, తెలంగాణ రాష్ట్ర భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం విచ్చేసిన భక్తులకు సంపక్తి భోజన కార్యక్రమం నిర్వహించారు. రాత్రికి అంతర్‌రాష్ట్ర భజన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన జట్లకు బహుమతులు అందచేస్తారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శంకరమ్మ, ఎంపిటిసి నరసన్న, సీతారామిరెడ్డి,మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ వెంకన్న, పులికొండ రంగన్న,హరినాథ్‌రెడ్డి, పరమన్న స్వామి,ఇస్మాయిల్, ఈశ్వరప్ప, నల్లారెడ్డి, లింగన్న,రాజన్న, దస్తగిరి, వెంకటేష్, మునిస్వామి, రంగముని, నల్లన్న,రంగన్న, గ్రామపెద్దలు భజన తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులను ఉపయోగించుకోవాలి

**పత్తికొండ, జనవరి 30, ప్రభాతవార్త:** ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి హామీ పనులను ఉపాధి కూలీలు ఉపయోగించుకోవాలని ఎంపిడిఓ సువర్ణలత అన్నారు. గురువారం మండల పరిధిలోని హోసూరు,పుచ్చకాయలమాడ గ్రామాల్లో ఉపాధి కూలీలకు ఉపాధి పనులను ఉపయోగించుకోవాలని కూలీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి కూలీలు వలసలు వెళ్లకుండ ఉన్న గ్రామాల్లో ఉపాధి పనులు చేసుకోవాలన్నారు. కూలీలకు పనిదినాలని గ్రామాల్లో మేనేజర్ ఎస్టిమేషన్ గ్రామాలు ఉన్న కూలీలు పనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ వెంకటేశ్వర్లు, ఈసి జిలాన్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం పట్టివేత

**దేవనకొండ, జనవరి 30, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కప్పట్రాళ్ల-పి కోటకొండ గ్రామాల రహదారి మధ్యలో అక్రమంగా తరలిస్తున్న 49కర్ణాటక మద్యం బాక్సులను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ వంశీనాథ్ గురువారం విలేకర్లకు తెలిపారు. కర్ణాటకకు చెందిన బొలోరో వాహనాన్ని అనుమానంతో వెంబడించడం జరిగిందని నింధితులు వాహనాన్ని వదిలి పరారయ్యారు. వాహనంలో ఉన్న 49కర్ణాటక మద్యం బాక్సులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. నింధితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. అక్రమ మద్యం రవాణాదారులు బొలోరో వాహనం కానిస్టేబుల్‌పై దాడికి యత్నం అనే ఆరోపణలు అవాస్తవమని సిఐ తెలిపారు.

## వ్యాపార లావాదేవీలు లేవు..వ్యాపారాలు జరిగేదెలా..?

**:- అద్దెలు 30శాతం తగ్గించాలి..**

**:- పంచాయతీ కార్యదర్శికి వ్యాపారులు వినతి**

**ఆలూరు, జనవరి 30, ప్రభాతవార్త:** ఆలూరు పట్టణంలోని సంతమార్కెట్‌లో ఉన్న షాప్స్‌కు 30శాతం అద్దె తగ్గించాలని గురువారం గ్రామ పంచాయతీ ఈఓ ప్రభాకర్‌రావును వ్యాపారులు కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ షాప్స్ ఉన్న చోట వ్యాపార లావాదేవీలు లేవని దీంతో అక్కడ షాప్స్ ప్రారంభించుకున్నా వ్యాపారాలు జరగడం కష్టం అన్నారు. బస్టాండ్‌లో ఉన్న కూరగాయలు,పండ్లు,పూల వ్యాపారాలు,చికెన్,మటన్ దుకాణాలు కూడా సంత మార్కెట్‌లోకి తరలిస్తే వ్యాపారాలు జరుగుతాయన్నారు. అందుకే అద్దెను తగ్గించాలని కోరారు. అలాగే కాంప్లెక్స్‌కు భద్రత కల్పించేవిధంగా గేట్లు వేయాలన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రవీంద్రరావు,వ్యాపారులు భీమా,మహేంద్ర, ఖాదర్, మీరా, గౌడ్ పాల్గొన్నారు.

## మండలంలోని పలుగ్రామాలను సందర్శించిన ఎంపీడిఓ



**కర్నూలు అర్బన్, జనవరి 30, ప్రభాతవార్త:** కల్లూరు మండలంలోని బస్తిపాడు, బొల్లవరం, పుసులూరు, రేమడూరు గ్రామాల సచివాలయాలను ఎంపీడిఓ జి నాగశేషాచలరెడ్డి సందర్శించారు. ఈసందర్భంగా సచివాలయాల్లో ఎంఎస్ఎంఈ మిస్సింగ్ సిటిజన్స్, హెచ్‌హెచ్ జియోట్యాగింగ్, 06 సంవత్సరాలు, పెన్షన్ మ్యాపింగ్, ఎస్‌బిఎం సర్వే నాన్‌రెసిడెంట్, ఏపీడేటా, ఎన్‌పిసిఐ సర్వే, ఐహెచ్‌హెచ్ఎల్, అటెండెన్స్ ఎస్‌డబ్ల్యుపిసిఎస్ మొదలగు వాటిపై కల్లూరు ఎంపీడిఓ నాగశేషాచలరెడ్డి, ఈఓఆర్డి నాగేష్‌లు సచివాలయ సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

## స్వయం ఉపాధి పథకాల కొరకు దరఖాస్తుల స్వీకరణ.

**మిడుతూరు జనవరి 30 ప్రభాతవార్త:** మిడుతూరు మండల పరిధిలో బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాల కొరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని ఎంపీడీవో దశరథ రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీ నుండి 7వ తేదీ వరకు ఆన్లైన్ ద్వారా ఆసక్తి గలవారు తమ దరఖాస్తులను నమోదు చేసుకోవాలని ఎంపీడీవో తెలిపారు. అదేవిధంగా బీసీ, ఈ బీసీ, కమ్మ, రెడ్డి, ఆర్య వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు (కాపు, బలిజ ,తెలగ, ఒంటరి) కార్పొరేషన్లకు సంబంధించి స్వయం ఉపాధి పథకాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని, దీనికి 21 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వరకు అర్హత వారు దరఖాస్తు చేసుకొని, దీనితోపాటు రేషన్ కార్డు, కుల ధృవీకరణ పత్రము, ఆధార్ కార్డులు జిరాక్సులు జతపరచవలనని ఎంపీడీవో తెలిపారు.

## సేవా దృక్పథమే తన లక్ష్యం..!

**:- ప్రజాసేవకే అంకితం**

**:- టిడిపితో అన్ని వర్గాలకు సమన్యాయం**

**:- టిడిపి యువత నాయకులు పోతురాజుల రాముడు**



**చిప్పగిరి, జనవరి 30, ప్రభాతవార్త:** సమాజంలో సేవ చేయాలనే ఆలోచనతో సేవ దృక్పథమే తమ లక్ష్యంగా ఎంచుకొని రాజకీయాల్లోకి రాణించినట్లు టిడిపి యు వత నాయకులు పోతురాజుల రాముడు పేర్కొన్నారు. గురువారం ప్రభాతవార్తతో ఆయన మాట్లాడుతూ తాను విద్యార్థి దశ నుండి రాజకీయాల వైపు రాణించినట్లు తెలిపారు. మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం అడుగుజాడల్లో అభివృద్ధే ధ్యేయంగా,ప్రజాసేవకు అంకితం కావాలని సేవ చేయాలనే పట్టుదల ఉన్నట్లు తెలిపారు. తాను చిప్పగిరి మండల టిడిపి యువత సీనియర్ నాయకుడిగా టిడిపి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆలూరు నియోజకవర్గ ఇంచార్జ్ వీరభద్రగౌడ్ ఆదేశాల మేరకు అభివృద్ధే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. టిడిపి ఇంచార్జ్ వీరభద్రగౌడ్ సహకారంతో సిసిరోడ్లు,డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యువతకు మంచి చేయూతనందించి యువతకు ఉద్యోగ భద్రతను కల్పించింది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని గుర్తుచేశారు. చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారుతుందని పేర్కొన్నారు. అధికారం చేపట్టిన వెంటనే అభివృద్ధి పనులకు పెద్దపీత వేసి సిసిరోడ్లు ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయడం ఇందుకు నిదర్శనమన్నారు. రాబోయేరోజుల్లో మరెన్నో అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపడుతాడని ఆశాభావం వ్యక్తం చేశారు. చిప్పగిరి మండలం అభివృద్ధిలో ముందడుగులో ఉంటుందని పేర్కొన్నారు. నీతి అయోగ్ కింద ఒకటిన్నర కోటి రూపాయలు చిప్పగిరి మండలానికి మంజూరయ్యాయని అధికారులు వాటికి సంబంధించిన ఎస్టిమేషన్లు,వర్క్ ఐడి తీర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. తొందరలో ఆ పనులు కూడా ప్రారంభమవుతాయన్నారు. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిస్థితిని ఇంటెలిజెన్స్ విభాగం ద్వారా ఆరా తీస్తున్నట్లు తెలిపారు. అవినీతికి తావు లేకుండ అభివృద్దే లక్ష్యంగా పనులు జరుగుతున్నాయని అన్నారు. రూ.3వేల పింఛన్లు ఏకంగా రూ.4వేలకు సిఎంం చంద్రబాబు పెంచడంతో వృద్ధులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. టిడిపి ప్రభుత్వంలో మున్ముందు రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు.

## వైద్యం పేరుతో ప్రజల ప్రాణాలు తీస్తున్న ఓమ్ని హాస్పిటల్‌ను సీజ్ చేయాలి

-ఏఐవైఎఫ్



**కర్నూలు హాస్పిటల్, జనవరి 30, ప్రభాతవార్త:** వైద్యం కోసం వస్తే ప్రాణాలు కపాడాల్సింది పోయి ప్రజల ప్రాణాలు తీస్తున్న ఓమ్ని హాస్పిటల్‌ను సీజ్ చేసి కురువ ఆదిలక్ష్మీ మృతికారణమైన డాక్టర్‌ను అరెస్టు చేయాలని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గురువారం ఓమ్ని హాస్పిటల్ ముందు ఆదిలక్ష్మీ కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నగర కార్యదర్శి బిసన్నలు మాట్లాడుతూ ఓపెన్ హార్ట్ సర్జరీ కోసం బండగట్టు దేవరమండలానికి చెందిన కురువ ఆదిలక్ష్మీ ఆరోగ్యశ్రీ కింద జాయిన్ అయినప్పటికి పేషెంట్ బంధువుల దగ్గర రూ.70 వేలు వసూలు చేయడమే కాకుండా నిర్లక్ష్యంగా సర్జరీ చేయడంతో సర్జరీ నాటి నుండే అనేక అనారోగ్యసమస్యలతో తిరిగి హాస్పిటల్‌కు వస్తే డాక్టర్లు సరిగా పట్టించుకోకుండా 7 లక్షల 70 వేల రూపాయలు బిల్లులు చేసి నిన్నటిరోజు ఉదయం చనిపోతే ఓమ్ని హాస్పిటల్ యాజమాన్యం అక్కడి డాక్టర్లు దాచిపెట్టి మృతురాలి బంధువులు ఎన్నిసార్లు నిలదీసినప్పటికి సరైన సమాధానం ఇవ్వకుండా కాలయాపన చేసి గురువారం తెల్లవారుజామున 2 గంటలకు చనిపోయిందని బాడిని తీసుకెళ్లాలని బలవంతం చేశారన్నారు. ఇలా నిర్లక్ష్యంగా వైద్యం చేస్తు ప్రజల ప్రాణాలు తీస్తున్న ఓమ్ని హాస్పిటల్‌ను సీజ్‌చేసి యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు, సోమన్న, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు నాగరాజు, నగర నాయకులు కృష్ణ, చంటి, మధు తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతాళలేక బావిలో దూకి బైక్ మెకానిక్ అత్మహత్య



**నంద్యాల, జనవరి 30, ప్రభాతవార్తప్రతినిధి:** నంద్యాల జిల్లా గోస్పాడు మండల పరిదిలో సాంబవరము మెట్ట వద్ద ఒక బావిలో బైక్ మెకానిక్ అత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలోకి వెళ్లితే శిరువెల్ల మండలం చెన్నూరు గ్రామానికి చెందిన వుశేని(35) అనే బైక్ మెకానిక్ అప్పు బాద తాళలేక గోస్పాడు మండలంలో సాంబవరము మెట్ట వద్ద ఉన్న బావిలో దూకి అత్మహత్య చేసుకున్నాడు మృతుడుకి ఇద్దరు అడపిల్లలు ఉన్నారు ఇతనికి సుమారు 4లక్షలు దాకా అప్పు ఉన్నట్లు తెలుస్తోంది. విషయం తెలియగనే శిరువెల్ల పోలీసులు సంఘటనా స్థలము వద్దకు వెళ్లి బావిలో నుండి మృతదేహాన్ని బయటకు తీశారు.

## శ్రీశైలం నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షులుగా వరకవి నాగరాజు

**:-పార్టీ జెండా మోసిన యువ నాయకులకు రాజకీయ అవకాశం**

**:-మాజీ ఎంఎల్ఏ శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పా భువనేశ్వరరెడ్డిలకు రుణపడి ఉంటా**

**:-రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేకాభినందనలు**



**ఆత్మకూరు, జనవరి30, ప్రభాతవార్త:** శ్రీశైలం నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షులుగా ఆత్మకూరు పట్టణానికి చెందిన వైసిపి యువ నాయకులు మాజీ పట్టణ ప్రధాన కార్యదర్శి వరకవి నాగరాజును నియమించిన్నట్లు వైసిపి పార్టీ నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిసి సెల్ అధ్యక్షుడు మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గంలో వైసిపి పార్టీ బిసి సెల్ అధ్యక్షుడుగా అవకాశం కల్పించిన మాజీ ఎంఎల్ఏ శిల్పా చక్రపాణిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డిలకు యువ నాయకుడు శిల్పా కార్తీక్‌రెడ్డిలకు రుణపడి ఉంటానని వివరించారు. నియోజకవర్గ స్థాయిలో వైసిపి పార్టీలో ప్రత్యేక గుర్తింపు ఇచ్చిన నాకు బిసిల అభ్యున్నతికి పాటి బలోపేతానికి అన్ని విదాలుగా సహయ సహకరాలు అందిస్తానని వివరించారు. నియోజకవర్గంలో బిసి నాయకులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పార్టీని మరింత బలోపేతంగా కృషి చేస్తానని కొనియడారు. పార్టీ జెండా మోసిన నాకు నియోజకవర్గ స్థాయిలో అవకాశం కల్పించిన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పార్టీ పెద్దలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. నియోజకవర్గ స్థాయిలో బిసిల కోసం వైసిపి పార్టీ జెండాతో అలుపెరగని నాయకుడుగా యువ న్యాయకత్వ రాజకీయం కొనసాగిస్తానని తెలిపారు. గతంలో వైసిపి పార్టీ అదికారంలో ఉన్నప్పుడు ఆత్మకూరు పట్టణ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సందర్బాలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రస్తుతం నియోజకవర్గ స్థాయిలో రాజకీయంగా బిసి సెల్ అధ్యక్షులుగా అవకాశం కల్పించిన రాష్ట్ర వైసిపి పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## వైసీపీ నాయకునికి సంతాపం



**చాగలమర్రి, జనవరి 30, ప్రభాతవార్త:** మండలంలోని బ్రహ్మణపల్లె గ్రామానికిచెందిన వైసీపీ నాయకుడు మూరబోయిన పెద్ద నాగన్న (73) గురువారం మృతిచెందారు. పెద్ద నాగన్న మృతిచెందిన విషయం తెలుసుకున్న వైసీపీ మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి రాష్ట్రసేవాదల్‌కార్యదర్శి సుందూరు వెంకటరమణ, మాజీ సొసైటి అధ్యక్షులు పెద్ద దస్తగిరి, రమేష్‌రెడ్డి బ్రహ్మణపల్లె గ్రామానికి చెందిన పెద్ద నాగన్న మృతదేహంపై పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. సంతాపం తెలిపినవారిలో బొల్లవరం శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, లూక, నాగేశ్వర్‌రావు తదితరులున్నారు.

## రోడ్డు భద్రతపై అధికారులతో సమీక్ష సమావేశం

**ఆదోని, జనవరి 30, ప్రభాతవార్త:** పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఆదోని డివిజన్ స్థాయి రోడ్డు భద్రతపై సంబంధిత అధికారులతో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. రోడ్డు భద్రత,ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సబ్ కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి హేమలత,ఆర్టీఓ నాగేంద్ర,మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిరదీప్తి,ఉపేంద్ర,ఆర్‌అండ్‌బి డిప్యూటీ ఇంజనీర్ వెంకటేశ్వర్లు,మున్సిపల్ కమీషనర్ కృష్ణ,డిప్యూటీ డిఎంహెచ్ఓ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## నల్లమల గిరిజన తాండ వాసికి వైసిపి గిరిజన అధ్యక్షుడుగా అవకాశం

**శ్రీశైలం నియోజకవర్గ స్థాయిలో శివశంకర్‌నాయక్‌కు రాజకీయ గుర్తింపు**



**ఆత్మకూరు, జనవరి30, ప్రభాతవార్త:** నల్లమల అటవీ ప్రాంతానికి సమీపంలో నివాసం ఉంటున్న సంజీవనగర్ తాండ గ్రామానికి చెందిన వైసిపి గిరిజన యువ నాయకుడికి శ్రీశైలం నియోజకవర్గంలో ఎస్టీ అధ్యక్షునిగా అవకాశం దక్కింది. 15 సంవత్సరాలుగా వైసిపి పార్టీలో కీలకమైన రాజకీయాలు గ్రామ స్థాయిలో కొనసాగించడంతో పార్టీ అదిష్టానం ఇచ్చిన ఉత్తర్వులతో గిరిజన సమస్యల అభ్యున్నతికి కృషిచేసే విదంగా ముందుంటానని ఎస్టీ నియోజకవర్గ అధ్యక్షుడు శివశంకర్‌నాయక్ గురువారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎంఎల్ఏ శిల్పా చక్రపాణిరెడ్డి సహకారంతో నియోజకవర్గ స్థాయిలో రాజకీయ గుర్తింపు రావడం హర్షించదగ విషయమని గుర్తు చేశారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహాన్‌రెడ్డి నాపై నమ్మకం ఉంచి నియోజకవర్గ స్థాయిలో రాజకీయానికి అవకాశం కల్పించిన వైసిపి పార్టీ పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గం స్థాయిలో గిరిజన సమస్యలు, పార్టీ బలోపేతానికి అన్ని విదాలుగా ముందుంటానని వివరించారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గ స్థాయిలో రాజకీయంగా నాకు గుర్తింపు ఇచ్చిన శ్రీశైలం నియోజకవర్గ వైసిపి పార్టీ పెద్దలకు మరోసారి పత్రిక ముఖంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఇదేమి ఖర్మ బాపూజీ..జాతిపితకు ఇచ్చే గౌరవడం ఇదేనా సారూ..

**:-పాలకులకు జాతిపిత వర్ధంతి అవసరం లేదా**

**:-వర్ధంతికి దూరమవుతున్న మహాత్ముడు**

**:-తీరిక లేదా లేక నిర్లక్ష్యమా..మనకెందుకులే అనుకున్నారా**

**:-ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జరగని గాంధీ వర్ధంతి**

**:-మహాత్మా..మన్నించు..వర్ధంతి నాడు పూలమాలకు నోచుకోని జాతిపిత వి గ్రహాలు**



**ప్యాపిలి జనవరి30(ప్రభాతవార్త):** రవి అస్తమించని బ్రిటిష పాలకుల ఇనుప సంకెళ్ళ నుండి విముక్తి కలిగించిన మహనీయుడు, అహింస, సత్యం అనే ఆయుధాలతో భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించిన ధీరుడు..బ్రిటిష పాలకుల నిర్ణయాలకు సహయ నిరాకరణ, ఉప్పు సత్యాగ్రహం ఉద్యమాలు చేసి బ్రిటిష దొరలను గడగడలాడించి జాతిపితగా గుర్తింపు పొందిన మోహన్‌దాస్ కరంచంద్ గాంధీగా పిలవబడే మహాత్ముని వర్ధంతిని నిర్వహించలేని పాలకులు ఉండటం దారుణం. జనవరి 30న ప్రార్ధన చేస్తున్న సమయంలో గాడ్సే అనే వ్యక్తి తుపాకితో కాల్చి చంపారు. గాంధీజీ అస్తమించిన రోజును దేశ వ్యాప్తంగా మహాత్మగాంధీ వర్ధంతిగా నిర్వహిస్తున్నారు. దేశానికి జాతిపిత అయిన మహాత్మగాంధీ విగ్రహాలు దేశ నలుమూలల ప్రతిష్టించి స్మరిస్తున్నారు. అక్టోబరు రెండున మహాత్మగాంధీ జయంతి, జనవరి 30న గాంధీ వర్ధంతిని నిర్వహిస్తున్నారు. ఇటివల గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అయితే మహాత్మగాంధీ వర్ధంతిని మాత్రం నిర్వహించని ప్రాంతం ఉందంటే బాధకరం. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలంలో గురువారం గాంధీ వర్ధంతిని నిర్వహించలేదని ప్రజలు ఆవేధన వ్యక్తంచేస్తున్నారు. దేశానికి స్వాతంత్ర్యం గాంధీ తీసుకుని వచ్చారని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చే నాయకులు కూడ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించక పోవడం శోచనీయం. కనీసం ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జాతిపిత వర్ధంతిని అధికారులు ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నిస్తున్నారు. గాంధీకి వారసులమని డబ్బాలు కొడుతున్న నాయకశిఖామణులకు మహాత్ముడి వర్ధంతి గుర్తుకు రాలేదా లేక తెలిసినా తమకెందుకులే అని మిన్నకుండి పోయారా అన్నది వెయ్యి డాలర్ల ప్రశ్నగా మారింది. ప్యాపిలి పట్టణ నడిబోడ్డున ఉన్న గాంధీ విగ్రహానికి కనీసం పూలమాల వేసే నాయకులు ప్యాపిలిలో కరువయ్యారా అని ప్రజలు ఆశ్చర్య పోతున్నారు. ఎప్పుడో స్వాతంత్ర్యం తెచ్చిన మహాత్మునితో తమకేమి పని అని భావించారా అన్న సందేహాలు కలుగుతున్నాయి. గాంధీ విగ్రహానికి ఎండిపోయిన పూలమాల ఉండటాన్ని చూసిన ప్రజలు ఆవేదనకు గురై నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. నడిబజారులో ఉన్న గాంధీ విగ్రహానికి వర్ధంతి నాడు కనీసం దండ వేయడానికి ప్రజలు కూడ ప్రయత్నించక పోవడం దారుణం. సిద్ధాంతాలు, హక్కులు అంటూ రోడ్డెక్కె ప్రజా సంఘాల నాయకులు కూడ గాంధీ వర్ధంతినాడు జాతిపితను విస్మరించడం దారుణం. అదే విధంగా ఎమ్పీడివో కార్యాలయంలో, ఈవోఆర్డీ చాంబరులో బోసిపోయిన జాతిపిత చిత్రపటాలను కార్యాలయానికి వచ్చిన వారు చూసి ఆశ్చర్యానికి గురై మహాత్మ మన్నించు అంటూ మనస్సులోనే స్మరించుకుని అధికారుల తీరును తప్పుపట్టారు. గాంధీ వర్ధంతిని అధికారికంగా ప్రభుత్వం ఎందుకు నిర్వహించలేదని ప్రజలు నిలదీస్తున్నారు. ప్యాపిలిలో గాంధీ వర్ధంతిని నిర్వహించలేని దుస్థితిలో ఉన్న నాయకులు, అధికారులను క్షమించు మహాత్మ అంటూ ప్రజలు వేడుకుంటున్నారు. ఇప్పటికైన కనీసం బావితరాలకు జాతీయ నాయకుల త్యాగాలు, పోరాటాలపై అవగాహన కల్పించి వారిని స్మరించే కార్యక్రమాలను నిర్వహించాలని ప్రజలు కోరారు.

## పనికి తగిన కూలీ అందిస్తాం



**గోనెగండ్ల జనవరి 30 ప్రభాతవార్త :** ప్రతి ఉపాధి కూలీకి పనికి తగిన కూలీ డబ్బులు అందజేస్తామని ఎంపీడీవో మణిమంజరి అన్నారు.గురువారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని గ్రామ శివార్లలో జరుగుతున్న ఉపాధి పనులకు ఎంపీడీవో మణిమంజరి పరిశీలించారు.ఏ పనులు చేస్తున్నారు.ఎప్పటి నుంచి చేస్తున్నారు. ఏమైన ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలు సుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధి పనులు కల్పిస్తున్నాము ఎవ్వరు బతుకు తెరువు కోసం ఇతర ప్రాంతాలకు వసల వెళ్ల వద్దు అని కూలీలను కోరారు.అలాగే వలసలు వెళ్లితే అక్కడ జరిగే ఇబ్బందులను గురించి కూలీలకు వివరించారు.అక్కడ వచ్చే కూలీ డబ్బులే ఇక్కడ కూడా వస్తామని వలసల వల్ల మీ పిల్లల చదువు దెబ్బ తింటుందని మీ పిల్లల భవిష్యత్ కోసమైనా ఆలోచించాలని కోరారు.అలాగే గ్రామాలలో ఉపాధి పనులు చేస్తే రోజుకు రూ.300 కూలీ వస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ ఆనంతశయనా,ఎపీవో మహమ్మద్‌బాషా,పీల్డ్ అసిస్టెంట్ రఫీక్ సిబ్బంది పాల్గొన్నారు

## నాడు సూపర్‌సిక్స్ అన్నారు. నేడు అమలు పరచలేమంటున్నారు-పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి

**వెల్దుర్తి, జనవరి30, ప్రభాతవార్త:** నాడు సూపర్‌సిక్స్ అన్నారు,నేడు అమలు పరచలేమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా అంటున్నారని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి అన్నారు. కర్నూలులోని ఆమె తన స్వగృహంలో రాష్ట్ర వైకాపా కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, వైకాపా నాయకులతో కలిసి గురువారం పాత్రికేయుల సమావేశం ఏర్పాటుచేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు వైకాపా ప్రభుత్వంలో ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను,ఇచ్చిన మాట తప్పక కరోనా వంటి ఎన్నో విపత్తులు వచ్చిన కష్టకాలంలో సైతం సంక్షేమపథకాల క్యాలెండర్‌ను విడుదల చేసిన జగనన్న జననేతగా ఎదిగాడన్నారు.ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపుతూ సూపర్‌సిక్స్ అంటూ ఎన్నికల హామీలతో అధికారంలోకి వచ్చి నేడు పథకాలను అమలు చేయలేమని ప్రకటన చేసి చంద్రబాబు నాయుడు ప్రజలను మోసం చేశారన్నారు.ప్రభుత్వం ఏర్పాటై 9 నెలలు కావస్తున్న ఈ కాలంలో రూ.1.19లక్షల కోట్లు అప్పులు తీసుకొచ్చారన్నారు.మీరు ప్రకటించిన అమ్మఒడి, రైతులకు పెట్టుబడి సహాయం,18 సంవత్సరాల నిండిన మహిళలకు నెలకు రూ.1500, లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇలాంటివి ,ఇవన్నీ ఎక్కడ అని ప్రజల తరపున ప్రశ్నిస్తున్నామన్నారు.జగనన్న ప్రభుత్వం దిగి పోయే సమయంలో రాష్ట్ర ఖజానా ఎంత ఉంది,మీరు 2019లో ప్రభుత్వం నుంచి దిగిన సమయంలో రాష్ట్ర ఖజానా ఎంత ఉండేదో బేరీజు వేసుకోవాలన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారన్నారు.రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేదాకా ప్రజల తరపున వైకాపా పోరాడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైకాపా కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి,క్రిష్ణగిరి మండల కన్వీనర్ ఆర్‌బి. వెంకటరాముడు, వైకాపా నాయకులు పుల్లగుమ్మి నాగార్జునరెడ్డి,అల్లుగుండు శ్రీరాంరెడ్డి,అనుబంధ సంఘాల నాయకులు, వెల్దుర్తి,క్రిష్ణగిరి మండలాల వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి



**కొత్తపల్లె, జనవరి 30, ప్రభాతవార్త:** వసంతపంచమికి కొలనుభారతికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని తహశీల్దార్ ఉమా రాణి అధికారులకు అదేశించారు. ఆమె గురువారం కొలనుభారతిలో జరుగుతున్న వసంతపంచమి ఏరా ్పట్లను పరిశీలించారు. కోనేరు, వాహనాల పార్కింగ్, భోజనాలునిర్వహించే ప్రదేశాలను పరిశీలించారు. విధిగా వసంత పంచమి వేడుకలు విజయవంతం చేయాలని అధికారులకు అదేశించారు. ఈకార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ పెద్దన్న, సర్వేయర్ అనుషారాణి, ఆలయ కమిటీ చైర్మన్ వెంకటనాయుడు, గ్రామసర్పంచ్ చంద్రశేఖర్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

## అంధులకు నూతన వస్త్రాలు పంపిణీ



**నంద్యాల టెక్కె 30 జనవరి, ప్రభాతవార్త:** గాంధీ వర్ధంతి, లూయా బ్రెయిలీ జయంతిలను పురస్కరించుకుని అంధులకు నూతన వస్త్రాలు పంపిణీచేశారు. నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం, కంటిచూపు దివ్యాంగుల సంక్షేమ సంఘం, నంద్యాల ఐఎంఏ, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గాంధీజీ, లూయా బ్రెయిలీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ జి.రవికృష్ణ, డా. రామకృష్ణారెడ్డి, డాక్టర్ మధుసూదన్‌రావు, డాక్టర్ లక్ష్మీసౌజన్య, కంటి చూపు దివ్యాంగుల ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి ఓబులేసులు ప్రసంగించారు. కృత్రిమ మేధ సహకారంతో నూతన కంటి అద్దాలు ఇటీవల హైదరాబాదులో ఆవిష్కరించారని వాటి సహకారంతో కంటిచూపు లేని వారు అనేక ప్రయోజనాలు పొందడానికి ఆస్కారం ఉంటుందని వాటిని నిరుపేద అంధ విద్యార్థులకు అందజేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో వైద్యులు, లయన్స్‌క్లబ్ సభ్యులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

# అహింసా మార్గంలో పోరాడి దేశానికి స్వాతంత్య్రం తెచ్చిన మహోన్నత వ్యక్తి గాంధీజీ

**నంద్యాల, జనవరి 30, ప్రభాతవార్త ప్రతినిధి:** సత్యం, అహింసా మార్గంలో పోరాడి దేశానికి స్వాతంత్య్రం తెచ్చిన మహోన్నత వ్యక్తి గాంధీజీ అని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫయాజ్ అన్నారు. ఈసందర్భంగా ఎంగా గురువారం గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకొని గాంధీచౌక్ నందుగల గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ చూపించిన బాటలో నేడు ప్రపంచమంతా నడుస్తుండడం భారతీయులుగా మనకు గర్వకారణమన్నారు. గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెడుతున్న కూటమి ప్రభుత్వం అన్నారు. అహింసా మార్గంలో శాంతియుతంగా దేశానికి సాధించవచ్చని ప్రపంచానికి చాటిచెప్పారన్నారు. గ్రామాల్లో పెద్దఎత్తున సిమెంటు రోడ్లు నిర్మించడంతో పాటు గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడం కూటమి ప్రభుత్వం గాంధీ కన్న కలలను నిజం చేసిందన్నారు. అనంతరం తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్‌టాకీస్)నందు ఘనంగా మహాత్మగాంధీ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పార్టీ కార్యదర్శి, నంద్యాల టిడిపి అబ్జర్వర్ పోతురాజు రవికుమార్ పాల్గొని మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈకార్యక్రమంలో జనసేన నాయకులు సుధాకర్, రవి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




## కోడుమూరులో ఘనంగా మహాత్మ గాంధీ వర్ధంతి వేడుకలు



**కోడుమూరు,జనవరి30, ప్రభాతవార్త :** కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ భాగ్యరత్న ఆధ్వర్యంలో గురువారం జాతిపిత మహాత్మ గాంధీ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో సర్పంచ్ భాగ్యరత్న మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్యోద్యమ రూపకర్త జాతిపిత మహాత్మాగాంధీ త్యాగాలు ఎన్నటికీ మరువలేనివన్నారు. ఆ మహానేత అడుగుజాడలను ప్రతిఒక్కరూ ఆదర్శం చేసుకుంటూ బావితరాలకు ఆ మార్గాలు నేటి తరాలవారు బాటలు వేయాలన్నారు. అనంతరం మండల స్థాయి అధికారులతో పాటు, వైద్యాధికారులంతా కుష్టు వ్యాధి నిర్మూలనపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వ్యాధిపై ఎంపీడీవో ఎసి రాముడు, డిప్యూటీ తాహశీల్దార్ రామాంజినేయులు కుష్టి వ్యాధి నిర్మూలనపై వివరించారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు పంచాయతీ కార్యదర్శి అజయ్ భాస్కర్, ఆరోగ్య విస్తరణ అధికారి నరసప్ప, శానిటేషన్ అధికారి వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్ సాహెబ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి, ఆరోగ్య కార్యకర్తలు,ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో సమస్యలపై దృష్టి పెట్టండి

- డీఎల్‌డీఓ అనురాధ
- అధికారులతో సమీక్షించిన డీఎల్‌డీఓ అనురాధ



**హాలహర్వి, జనవరి30, ప్రభాతవార్త;** పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించాలని డీఎల్‌డీఓ అనురాధ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండలానికి ఉపాధి హామీ నిధులు రూ.2 కోట్లు మంజూరయ్యా యని ఆమె తెలిపారు. ఆ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ కాలువలు, తాగునీరు తదితర అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల అభివృద్ధి నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని ఆమె పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగులు పనితీరుపై ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. విదుల పట్ల నిర్లక్ష్యం వహించే ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ వరలక్ష్మి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మంత్రి బీసీని మర్యాదపూర్వకంగా కలిసిన శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్



**బనగానపల్లెరూరల్, జనవరి30, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని స్థానిక బీసీ గు రెడ్డి కాంప్లెక్స్ ఆవరణంలో గల రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదు పాయాలు మరియు పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం నందు గురువారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని శాసన మండలి మాజీ చైర్మన్, ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారుడు ఎం.ఏ. షరీఫ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం పై చర్చించారు.

## కుష్టువ్యాధి రహితగ్రామాలుగా తీర్చిదిద్దుకుందాం

-వైద్యాధికారి బాబు



**రుద్రవరం, జనవరి 30, ప్రభాతవార్త:** మనమందరం సమిష్టి బాద్యత వహించి కుష్టువ్యాధి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుకుందామని వైద్యాధికారి బాబు తెలిపారు. మండల పరిధిలోని నర్సాపురం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మహాత్మగాంధీ వర్థంతి సందర్భంగా కుష్టువ్యాధి వ్యతిరేక దినాన్నినిర్వహించారు. ఈసందర్భంగా స్పర్శ లెప్రసి అవగాహన కార్యక్రమం నిర్వహించి కుష్టు వ్యాధి గ్రస్థుల పట్ల ప్రేమ, అప్యాయతలు చూపుతామంటూ ప్రతిజ్ఞ చేశారు చర్మం మీద స్పర్శలేని మచ్చలు, చర్మంపై మచ్చలు, చెవులపై బొడిపేలు, లేదా కణితలు ఉన్నవారిని ప్రాధమిక ఆరోగ్యకేంద్రాలకు తీసుకెళ్లి వైద్యసేవలు అందిస్తామని సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కుష్టువ్యాధి లక్షణాలు గల వారిని ప్రేమ, అప్యాయతతో చూసుకుంటూ వారి పట్ల వివక్షత చూపకుండా వారికి మెరుగైన వైద్యసేవలు అందించడమే తమ లక్ష్యమని కుష్టువ్యాధి గ్రస్థులకు ఎంటిటి మందులు ఉచితంగా అందిస్తామని సకాలంలో వైద్యం అందించడం ద్వారా కుష్టువ్యాధి పూర్తిగా నయం అవుతుందని అలాగే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని కుష్టువ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే వైదా ్యధికారులను సంప్రదించాలని వైద్యాధికారి బాబు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శాంతకుమారి, వైద్యసిబ్బంది ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, విఆర్వో ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను బస్సుల్లో పరిమితికి మించి ఎక్కిస్తున్న విద్యాసంస్థలు..!




**ఆదోని,జనవరి 30,ప్రభాతవార్త:** ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యం బస్సులలో విద్యార్థులను పరిమితికి ఎక్కిస్తున్నారని అలాంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకుని బస్సులను సీజ్ చేయాలని ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు బసాపురం లింగప్ప, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్,ట్రెజరర్ శేఖర్‌లు డిమాండ్ చేశారు. గురువారం ఏఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఆద్వర్యం లో ఆర్టీఓకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రుల నుండి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ కూడా విద్యార్థులను పరిమితికి మించి బస్సులలో పశువులు,గొర్రెల్లా తరలిస్తున్నారన్నారు. గతంలో కూడా చాలాసార్లు విద్యాసంస్థల యాజమాన్యాలను హెచ్చరించినా ఫలితం లేదన్నారు. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రమాదాలు జరుగకముందే ఆర్టీఓ స్పందించి ఇలాంటి పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకుని బస్సులను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## వీరశైవ లింగాయత్‌లను ఓబిసిలో చేర్చాలి

**:- వీరశైవ లింగాయత్ టిడిపి పార్టీ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యులు బాదాడ కౌశిక్ కుమార్**

**తుగ్గలి,జనవరి 30,ప్రభాతవార్త:** రాష్ట్రంలో వీరశైవ లింగాయత్‌లను కేంద్రం ఓబిసి జాబితాలో చేర్చాలని వీరశైవ లింగాయత్ టిడిపి పార్టీ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యులు బాదాడ కౌశిక్ కుమార్ కోరారు. గురువారం ఢిల్లీలో ఆదోని శాసనసభ్యులు డాక్టర్ పార్థసారథి,జాతీయ ఓబిసి కమీషన్ సభ్యులు భువన్ భూషన్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకొని రాష్ట్రంలోని వీరశైవ లింగాయత్‌ల సమస్యలను వివరించి వీరశైవ లింగాయత్‌లను ఓబిసిలో చేర్చాలని వినతిపత్రం అందచేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా బాదాడ కౌశిక్ కుమార్ మాట్లాడుతూ వీరశైవ లింగాయత్ విద్యార్థులు విద్య,ఉద్యోగ,ప్రభుత్వ పథకాల పరంగా గత కొన్నేళ్లుగా ఎంతో నష్టపోతున్నారని అన్నారు. తమ బాధను గుర్తించి ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి,జాతీయ ఓబిసి కమీషన్ సభ్యులను కలుసుకొని వీరశైవ లింగాయత్‌లను ఓబిసిలో చేర్చి వీరశైవ లింగాయత్‌లకు న్యాయం చేయాలని కోరడం చాలా ఆనందంగా ఉందన్నారు. దీంతో ఆదోని ఎమ్మెల్యేకు తమ వీరశైవ లింగాయత్‌ల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఆయన అన్నారు.

## సబ్సీడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

**మద్దికెర,జనవరి 30,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మద్దికెరలో వెనుకబడిన తరగతులకు చెందిన వారికి స్వయం ఉపాధి పథకం కింద జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సబ్సీడీ రుణాలు అందచేయడం జరుగుతుందని ఎంపిడిఓ కొండయ్య తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ మద్దికెర మండలానికి 50యూనిట్లను కేటాయించడం జరిగిందని ఫిబ్రవరి 7న చివరి తేదీ అని ఈ ప్రక్రియను ఫిబ్రవరి 20వ తేదీలోపు ముగించమని పై అధికారుల నుండి ఆదేశాలు రావడం జరిగిందన్నారు.

## నలుగురికి నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

-పార్టీ గుర్తింపై హార్షం వ్యక్తం చేస్తున్నా నాయకులు

**కొత్తపల్లె. జనవరి 30, ప్రభాతవార్త:** కొత్తపల్లె మండలం నుంచి నలుగురికి వైసీపీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమిస్తు పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీచేసింది. ఎదురుపాడు గ్రామానికి చెందిన షేక్ రహంతుల్లాకు పబ్లిసిటి విభాగం, పాతమాడుగుల ( ఇంటెలెక్సువల్ విభాగం, దుద్యాల గ్రామ సర్పంచ్ శోభలతకు అంగన్‌వాడీ విభాగం అధ్యక్షులుగా నియమించారు. అధ్యక్షులుగా అవకాశం ఇచ్చిన బైరెడ్డి సిద్దార్థరెడ్డికి, నియోజకవర్గ ఇంచార్జీ డా.దారా సుధీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అయా విభాగాల్లోని అంశాలపై ప్రత్యేక దృష్టి వుంచి పార్టీ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషిచేస్తామన్నారు.

## జిల్లా ప్రజలు వాట్సప్ గవర్నెస్ సేవలు వినియోగించుకోండి

-ఐటిడిపి జిల్లా అధ్యక్షులు గట్టు తిలక్

**కర్నూలు హాస్పిటల్, జనవరి 30, ప్రభాతవార్త:** దేశంలోని తొలిసారి ఆంధ్రప్రదేశ్‌లో వాట్సాప్ గవర్నెస్ అనేది మొదలైందని మంత్రి నారా లోకేష్ గురువారం వాట్సాప్ గవర్నెస్‌ను ప్రారంభించి తొలి విడతలో 161 సేవలున్నాయని వాటిలో దేవాదాయ, విద్యుత్, ఆర్టీసి రెవిన్యూ, అన్నక్యాంటీన్, సిఎంఆర్ఎఫ్, మున్సిపల్ శాఖల సేవలు ప్రజలు వినియోగించుకోవచ్చని ఐటిడిపి కర్నూలు జిల్లా అధ్యక్షుడు గట్టు తిలక్ తెలిపారు. రెండోవిడతలో 360 సేవలు అందుబాటులోకి వస్తాయని వాట్సాప్ అనేది ఈకాలంలో ప్రతిఒక్కరు నవియోగిస్తున్నారని ప్రభుత్వం కేటాయించిన ఈవాట్సాప్ నం.9552300009 ఏ సర్టిఫికెట్ కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరగకుండా ఈనంబర్ ద్వారా వాట్సాప్ గవర్నెస్‌లో సులభంగా పొందవచ్చన్నారు. ఇందులో భాగంగా ప్రతి సర్టిఫికెట్‌పైన క్యూఆర్‌కోడ్ అనేది ఒకటి వస్తుందని ఎక్కడా నకిలీ తయారుచేయడానికి అస్కారం లేకుండా రూపొందించారని ప్రభుత్వాన్ని కొనియాడారు.

## మార్కండేయా..మాపై చూపు నీదయా..

:-భక్తిశ్రద్దలతో స్వామి గోపుర కలశపూజలు..

**కోసిగి, జనవరి 30, ప్రభాతవార్త:** స్వామి మార్కండేయా మాపై చూపు నీదయా అంటూ పద్మశాలి కులబాంధవులు వేడుకున్నారు..కోసిగిలోని శ్రీ భక్త మార్కండేయ స్వామి ఆలయంలో నూతన గర్బగుడి గోపుర, ముఖద్వారం గోపుర శిఖర కలశ స్థాపన పూజలు గురువారం భక్తులు ఘనంగా నిర్వహించారు.ముందుగా గురువారం తెల్లవారు జామునే ఆలయంలో వేద పండితులు గరుడాద్రి వెంకట సుబ్బయ్య శాస్త్రీ నేతృత్వంలో పద్మశాలి కుల బాంధవులు పూజలు చేసారు.. ఆలయంలో మార్కండేయ స్వామికి అభిషేకాలు గావించి మహా మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం అగ్ని ప్రతిష్ట, గణపతి హోమం నిర్వహించారు..సాయంత్రం మేళతాళాలతో కలశాలు చేపట్టి ఊరేగింపుగా వెళ్లి పుట్టమట్టిని సేకరించి ఆలయంకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా భక్తులు నూతన వస్త్రాలు ధరించి వేద పండితులు వేద మంత్రోచ్ఛరణాల మధ్య హోమాలను చేపట్టారు.అనంతరం జలాధివాసం సాయం దీక్షహోమం, ప్రధాన దేవత మూల మంత్ర హోమం చేపటట్టారు.. అలాగే రేపు ప్రత్యేక పూజచేపట్టి ఈ నెల 2వ తేదిన గోపుర శిఖర కలశ స్థాపన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.. ఈ పూజల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు..

## స్పర్శ కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం

**నంద్యాల హాస్పటల్,జనవరి 30,ప్రభాతవార్త:** కుష్టు వ్యాధిపై జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్.వెంకటరమణ మరియు జిల్లా లెప్రసీ మరియు ఎయిడ్స్, టీబి అధికారి డాక్టర్. శారదాబాయి ఆధ్వరంలో మహాత్మగాంధీ కుష్టు రోగులకు చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన వర్ధంతిని జాతీయ కుష్టు నిర్మూలన దినముగా ప్రకటించిందని వారు తెలిపారు. గురువారం మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజల్వలన చేసి ఘనంగా నివాళీలు అర్పించారు. జిల్లాలో 15 రోజుల పాటు కుష్టువ్యాధి నిర్మూలనపై వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది స్పర్శ లెప్రసీ అవగాహన క్యాంప్ ప్రతి వార్డు, గ్రామ సచివాలయంలో జరుపబడుతున్నాయని వారు తెలిపారు. కలిసికట్టుగా అవగాహన పెంచుకుందాము, అపోహాలను తొలగిద్దాం మరియు కుష్టు వాయధి బారిన పడిన ఏ ఒక్కరు వెనుకడకుండా చూసుకుందాం అనే నినాదంతో ముందుకు సాగుదాం అని, 2027 నాటికి లెప్రసీ ఫ్రీ ఇండియా గా మారుద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.కాంతారావు, డా.సురేంద్రబాబు, డా.అంకిరెడ్డి, డా.జగదీష్ చంద్రారెడ్డి, డా.తేజేశ్వరి, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బాధితుల తరుపున గ్యాస్ ఏజెన్సీ వారిని కలిసిన బిజెపి నాయకులు

**ఆదోని,జనవరి 30,ప్రభాతవార్త:** పట్టణంలోని జలగర వీధిలో గ్యాస్ సిలిండర్ ప్రమాదం వల్ల దగ్ధమైన గుడిసెల ఘటన విషయంలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సూచన మేరకు గురువారం బిజెపి నాయకులు భారత్ గ్యాస్ కార్యాలయంలో యాజ మాన్యంతో చర్చించడం జరిగింది. భారత్ గ్యాస్ కార్యాలయానికి తీసుకెళ్లామని తెలిపారు. వారికి నష్టపరిహారం కింద ఆర్థిక సహాయం కోరడం కోసం యాజమాన్యాన్ని సంప్రదించామని వారు కూడా సానుకూలంగా స్పందించారని త్వరలోనే రెండు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రమాకాంత్, శ్రీనివాసాచారి, సాయి, ఫర్టిలైజర్ వీరేష్, మహదేవ్, అంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## అలుపెరుగని పోరాటాలు చేస్తున్న కెవిపిఎస్

**మంత్రాలయం,జనవరి 30,ప్రభాతవార్త:** సమాజం లోని కులవివక్ష నిర్మూలనకు చేస్తున్న పోరాటంలో కెవిపిఎస్ అలుపెరుగని పోరాటాలు చేస్తుందని మంత్రాలయం ఎస్ఐ శివాంజిల్ అన్నారు. గురువారం స్థానిక పోలిస్ స్టేషన్‌లో కెవిపిఎస్ నూతన డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన జరుగుతున్నా యన్నారు. కులవివక్ష నిర్మూలనకు తమవంతు పాత్రతాము పోషిస్తున్నట్లు తెలియజేశారు.అదేవిధంగా కెవిపిఎస్ కూడా ఎక్కడ కులవివక్ష ఉందని తెలుస్తుందో అక్కడ పోరాటాలు చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు జయరాజు, అంజి,లక్ష్మణ్ణ,మండల అధ్యక్షులు గిడ్డయ్య సురేష్, మారెప్ప,ఇశ్రాయేలు,దేవా, చిన్నతిక్కన్న, ఆంజనేయులు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## వాహన డ్రైవర్లు,యజమానులతో సమావేశం

**శ్రీశైలం ప్రాజెక్టు, జనవరి30,ప్రభాతవార్త:** శ్రీశైలం మండలంలో గల జీపు,ఆటో డ్రైవర్లు, యజమానులతో గురువారం నాడు శ్రీశైలదేవస్థానం ఈఓ ఎం.శ్రీనివా సరావు,శ్రీశైలం సిఐ జి.ప్రసా దరావు సమావేశం నిర్వహించారు. రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా,మరియు శ్రీశైలంలో జరుగబోవు మహాశివరాత్రి పండుగ సందర్భం గా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలు నడిపె వారు వాహన రికార్డులు ఆర్‌సి,డ్రైవింగ్ లైసెన్సు, బీమా,ఫిట్‌నెస్ సర్టిఫికేట్,కాలుష్య దృవీకరణ పత్రం,యాత్రికుల పట్ల మంచిప్రవర్తన,తాగివాహనం నడపడం, అదికవేగం, ఓవర్‌లోడ్, సెల్‌పోన్‌డ్రైవింగ్, హెల్మెట్ దరించడం,సీట్ బెల్ట్ దరించడం,యాత్రికుల నుండి అదనపు చార్జిలు డిమాండు చేయడం, వాహన బీమా ప్రాముఖ్యత తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది అమరనాద్‌రెడ్డి, రఘనాధుడు, శంకర్, రాజేంద్రకుమార్, మహేష్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా సంచలనం రేపిన హత్యను ఛేదించిన ఆలూరు పోలీసులు

**ఆలూరు రూరల్, జనవరి30, ప్రభాతవార్త:** ఆలూరు మండల పరిధిలోని అరికెర గ్రామంలో బండారి ఈరన్నను ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు కోసమే హత్య చేసినట్లు పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య గురువారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకట్రామయ్య తెలిపిన వివరాల మేరకు మృతుడి భార్య బండారి నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు తన భర్త బండారి ఈరన్నను జనవరి 24న హత్యచేసిన వారిలో దబ్బాల గాదెలింగ, మంగలి గోపి, దబ్బాల గోవర్ధన్, బొగ్గుల ఈరన్న, బోయ రామదాసుల పై అనుమానం తెలుపుతూ ఫిర్యాదు చేసిందన్నారు. తమ విచారణలో బండారి ఈరన్న 2019 నుండి ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నడన్నారు. ప్రభుత్వం మారిన తరువాత అదే గ్రామానికి చెందిన దబ్బాల గాదెలింగ, మంగలి గోపి, బొగ్గుల ఈరన్న, బోయ రామదాసు బండారి ఈరన్న ఇంటికి వెళ్లి ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుకు రాజీనామా చేయాలని గత మూడు నెలల నుండి ఆయన ఇంటి వద్ద తిరుగుతూ భయభ్రాంతులకు గురిచేసి బెదిరించినట్లు తెలిసిందన్నారు. బండారి ఈరన్న తన ఉద్యోగానికి రాజీనా దబ్బాల గాదె లింగ మృతుడు బండారి ఈరన్న అక్కడికి చేరుకోగానే కాంట్లో కారంచల్లి గొడ్డలితో మెడ పై వెనకల నరకడంతో ఒక్కసారిగా ఈరన్న కుప్పకులగా విచ్చుణరహితంగా గాదెలింగ, గోవర్ధన్ గొడ్డలితో నరికారన్నారు. కురుకుంద మహేష్ పొలం గట్టు పై ఉండి ఎవరు గమనించకుండా ఉండేందుకు అక్కడే ఉన్నట్లు తెలిపారు. ఈ ముగ్గురు ఉద్దేశ్యపూర్వకంగానే కుట్రపన్ని, కాపుకాసి బండారి ఈరన్నను హత్య చేసినట్లు డీఎస్పీ తెలిపారు. వీరిలో దబ్బాల గాదెలింగ, దబ్బాల గోవర్ధన్‌లు ఆలూరులో వై జంక్షన్ నందు, కురుకుంద మహేష్‌ను అరికెరలో తన ఇంటి వద్ద అరెస్ట్ చేయడం జరిగిందని, వీరి నుండి ఒక గొడ్డలి, ఒక బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందని డీఎస్పీ తెలిపారు. బండారి ఈరన్నను బెదిరించిన ముగ్గురు పై హత్యచేసిన ఆ ముగ్గురు పై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ వెంకట్రామయ్య తెలియజేశారు.

## పారా లీగల్ వాలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్మనం

**నందికొట్కూరు,జనవరి 30,ప్రభాతవార్త:** సామాజిక సేవా,చట్టాలపై అవగాహన, ప్రజా సంక్షేమానికి అంకిత బావంతో వున్న వ్యక్తులు పారా లీగల్ వాలంటీర్‌గా దరఖాస్తులు చేసుకోవచ్చునని మండల లీగల్ సరీశ్వస్ కమిటీ వారు ఓ ప్రకటనలో తెలిపారు, కనీస విద్యార్హత 10వ తరగతి ఉత్తీర్ణత, మండల నివాసి అయి ఉండాలని తెలిపారు. ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు, విద్యార్థులు, అంగన్వాడీ కార్యకర్తలు, వైద్యులు, న్యాయ విద్యార్థులు, స్వచ్ఛంధ సంస్థ సభ్యులు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. దరఖాస్తు ఫారం నందికొట్కూరు మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నందు పొంద వచ్చునని, పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 31 సాయంత్రం 5 గంటలలోపు అందజేయలని లేదా పోష్టు ద్వారా అయిన పంపవచ్చునని తెలిపారు.

## ఘనంగా మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలు



**మంత్రాలయం,జనవరి 30,ప్రభాతవార్త:** నియోజక వర్గకేంద్రమైన మంత్రాలయంలో మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలు గురువారం ఘనంగా జరాగాయి.మంత్రాలయం ఎంఎల్ఏ వై.బాలనాగిరెడ్డి రాంపురంలోని తమ స్వగృహంలో ఈ వేడుకలు నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.ముఖ్యంగా శాంతి యుతంగా దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన విధానాన్ని ప్రజలకు వివరించారు.ప్రతిఒక్కరు గాంధీ చూపిన అహింసా మార్గంలో పయనించాలని ఆకాక్షించారు.ఈ కార్యక్రమంలో వైసిపి మండలఅధ్యక్షులు భీంరెడ్డి,మురళిరెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పశువుల ఉత్పాదకత పెంపే ప్రభుత్వ లక్ష్యం..



**తుగ్గలి,జనవరి30,ప్రభాతవార్త:** పశువుల ఉత్పాదకత పెంపే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పశు వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రాంపల్లి గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని ముక్కెళ్ల పశువైద్యా ధికారి డాక్టర్ వెంకటేష్ ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలు, పాడి పశువులతో కళకళలా డినప్పుడే ఏ ప్రాంతమైన సుభిక్షంగా,రైతులు ఆనందంగా ఉంటారన్నారు. పాడి రంగంలో అభివృద్ధి సాధించాలంటే పశువులు ఆరోగ్యంగా, పుష్టిగా ఉండాలని అప్పుడే ఉత్పాదకత పెరిగి రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేయడం జరుగుతుందన్నారు. పశువుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే మినీ గోకులాలకు శ్రీకారం చుట్టి మూగజీవుల ఆరోగ్య సంరక్షణకు మరో అడుగు ముందుకు వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి శ్రీనివాసులు, పశువర్ధక సహాయకులు రవితేజ,కలందర్ భాష,జేవివో ఆంజనేయులు,గోపాల మిత్రులు పూలరంగడు, అయ్యన్న, రాజగోపాల్, వినయ్ తదితరులున్నారు.

## పంట అమ్మిన తర్వాత కొనుగోలా : ఆర్‌విఎల్

**మద్దికెర,జనవరి 30,ప్రభాతవార్త:** ఖరీఫ్ సీజన్‌లో వేసిన కంది పంటను జనవరి చివరిన ప్రభుత్వం కొనుగోలు చేయడం చాలా విడ్డూరంగా ఉందని వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు రేలంపాడు వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో కందిపంట వేసిన రైతులు దళారులకు అమ్ముకున్న తరువాత కందులు కొనుగోలు చేయడం విడ్డూరంగా ఉందని ప్రస్తుతం రబీసీజన్‌లో వేసిన పప్పుశనగ కూడా దళారులను నమ్మి రైతులు మోసపోతున్నారన్నారు. కావున ప్రభుత్వం నిద్ర మత్తు వీడి రైతు పక్షాన ఈ ప్రభుత్వం నిలబడాలని ఆయన కోరారు.

## పాఠశాలల విలీనం చేసే యోచనను ఉపసంహరించుకోవాలి

– ఏపీటీఎఫ్ నాయకుల డిమాండ్

**గడివేముల, జనవరి30, ప్రభాతవార్త;** ప్రాథమిక పాఠశాలల విలీనాన్ని, అలాగే ప్రాథమికోన్నత పాఠశాలల్లోని 6, 7, 8 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడాన్ని తాము వ్యతిరే కిస్తున్నామని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు మానపాటి రవి, ఆవుల మునిస్వామి పేర్కొన్ననరు. గురువారం గడివేములలో జరిగిన ఏపీటీఎఫ్ సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదర్శ ప్రాథమిక పాఠశాలల పేరుతో రెండు కి.మీ. దూరంలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతుల విలీనాన్ని నిలుపుదల చేయాలని, అలాగే నిబంధనల మేరకు 6, 7, 8 తరగతులు కలిపి 60 మందికి పైగా విద్యార్థులు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించాలన్నారు. అయితే నిబంధనలకు వ్యతిరేకంగా మౌలిక వసతులు లేవనే నెపంతో 3 నుంచి 5 కి.మీ. దూరంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం దుర్మార్గమైన చర్య అని, వాటిని ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించాలన్నారు. లేనిపక్షంలో అలాగే కొనసాగించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశరు. పాఠశాల విద్యాశఖ ఇచ్చిన ఉత్తర్వులకు భిన్నంగా డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారు ఎక్కువ పాఠశాలలను విలీనం చేయాలని కిందిస్థాయి అధికారులకు మౌకిక ఆదేశాలు జారీ చేయడం తగదన్నారు. విద్య పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు దూరమై బాలకార్మికులుగా మారే ప్రమాదం ఉందన్నారు. ఉన్నత పాఠశాలలో 6, 7, 8 తరగతులకు సెక్షన్‌కు 53 మంది విద్యార్థులు ఉండాలని, 9, 10 తరగతులకు 60 మంది విద్యార్థులు ఉండాలని కమిషనర్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 53 మరియు 60 మంది విద్యార్థు కూర్చోవడానికి తరగతి గదులు సరిపోవని, ప్రతి తరగతికి 45 మంది విద్యార్థులు దాటితే రెండవ సెక్షన్ కేటాయించాలన్నారు. అలాగే ఇంగ్లిష్ మీడియంతో పాటు తెలుగు మీడియంలను కొనసాగించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశరు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా మహిళా కార్యదర్శి యు.కవిత, గడివేముల మండలశాఖ అధ్యక్షులు ఎం.ప్రతాపరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎల్.బాలస్వామి, సీనియర్ నాయకులు బి.రాంపుల్లారెడ్డి, జి.శ్రీరాములు, సి.మారెన్న, ఎస్.మహబూబ్‌బాషా, ఎ.నాగన్న, ఎస్.శ్రీనివాసులు, జి.వెంకటేశ్వర్లు, ఆదిశేషమ్మ, కోమలమ్మ, లక్ష్మిదేవి, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కొలిమిగుండ్లలో మండల సర్వసభ్య సమావేశం

**కొలిమిగుండ్ల, జనవరి30, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశాన్ని మండల అధ్యక్షురాలు కారపాకుల నాగవేణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాల పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో శివప్రసాదరెడ్డి శాఖల వారిగా సమావేశం నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశంలో పంచాయతీరాజ్, వ్యవసాయ, విద్యుత్, వైద్యం, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులు వారి వారి ప్రగతి నివేదికలను సభలో చదివి వినిపించారు. ఈ సమావేశంలో మీర్జాపురం సర్పంచ్ బి.మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ మా గ్రామానికి తూర్పు దిక్కున ఉన్న ప్రదేశంలో వేస్ట్ పదార్థాల ఫ్యాక్టరీ వల్ల దుర్వాసన వస్తుండడంతో ప్రజలు అనారోగ్యబారిన పడతారని ఈ దుర్వాసన రాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ రాబోవు వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మరియు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మించుటకు ఎవరైనా ముందుకు వస్తే జెడ్పీ నిధులు మంజూరు చేయుటకు సిద్దంగా ఉన్నామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్షుద్ర పూజల కలకలం

- ఆలూరు 1వ సచివాలయం వద్ద నిమ్మకాయలు, కోడిగుడ్లు, కుంకుమతో ఆఫీస్ ముందు క్షుద్ర పూజలు
- భయభ్రాంతులకు గురవుతున్న సిబ్బంది



**ఆలూరు రూరల్, జనవరి30, ప్రభాతవార్త:** ఆలూరు పట్టణంలో 1వ సచివాలయం వద్ద క్షుద్ర పూజలు చేయడంతో ఒక్కసారిగా సచివాలయ సిబ్బంది ఉలిక్కిపడ్డారు. బుధవారం అమావాస్య కావడంతో రాత్రి ఎవరో ఆఫీస్ ముందు నిమ్మకాయలు, కోడిగుడ్లు, పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ఉదయం ఆఫీస్‌కు వచ్చిన సిబ్బంది వాటిని చూసి భయభ్రాంతులకు గురయ్యారు. వీటన్నింటికి ప్రధానంగా ఆఫీస్‌కు ప్రహరిగోడ లేకపోవడం, విధులు నిర్వహించే సమయంలో చుట్టుపక్కల ఉండే ప్రజలు కార్యాలయ కి గురవుతున్నారు. వీటితోపాటు గొర్రెలు, మేకలు, పశువులు కట్టేస్తుండడంతో చాలా ఇబ్బందిగా ఉందని సచివాలయ సిబ్బంది తెలుపుతున్నారు. అయితే ఈ సమస్య తీరాలంటే సచివాలయానికి కాంపౌండ్‌వాల్ నిర్మించాలని గేటును ఏర్పాటుచేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని సచివాలయ సిబ్బంది తెలుపుతున్నారు. అయితే ఇదే విషయం పై పంచాయతీ సెక్రటరీని వివరణకోరగా ఉన్నతాధికారులకు నివేదిక పంపామని త్వరలోనే ఆ సమస్య పరిష్కరిస్తామని పంచాయతీ సెక్రటరీ ప్రభాకర్ తెలిపారు.

## పరిశుభ్రతతోనే ఆయుధాల పనితీరు భేష్

**ఆదోనిలీగల్, జనవరి30, ప్రభాతవార్త;** పోలీసుశాఖలో ఉపయోగించే ఆయుధాలను పరిశుభ్రం చేయడంతోనే ఆయుధాల పనితీరు భేష్‌గా ఉంటుందని రైల్వే ఎస్ఐ కె.గోపాల్ అన్నారు. గురువారం తన సిబ్బందితో ఆయుధాలను పరిశుభ్రం చేయించారు. తమ పోలీసులు ఉపయోగించే ఆయుధాలు (గన్‌లు) వారానికి ఒకసారి చాలా జాగ్రత్తగా క్లీనింగ్ చేయిస్తామన్నారు. లేకపోతే గన్‌లు లోపలికి దుమ్మూ, ధూళి చేరి పేరుకుని పోయి పనితీరు సరిగా ఉండదన్నారు. అందుకుగానూ వేడినీళ్లు, పెట్రోల్ ఆయుధాలకు సంబంధించిన నూనెతో క్లీనింగ్ చేయడంతో ఆయుధాలు సక్రమంగా, చురుగ్గా పని చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే జీఆర్‌పీ సిబ్బంది పి.సి.భాస్కర్, షేక్షావలి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని సమయస్ఫూర్తితో జరిపిన ఎమ్మెల్యే

**నందికొట్కూరు,జనవరి 30,ప్రభాతవార్త:**
ప్రతి నెల పట్టణాభివృద్ధికి తీసుకునే నిర్ణయాలపై జరిగే మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య కౌన్సిల్ సభ్యులను అటు అధికారులను సమన్వయం చేస్తు సమావేశాన్ని ఎంతో సమయస్ఫూర్తితో సభ్యులు అడిగిన అన్ని సమస్యలపై స్పష్టమైన హామీని అధికారులచే ఇప్పిస్తూ తన వంతు సహకారం పూర్తి స్థాయిలో ఉంటుందని హామీ ఇవ్వడంతో సమావేశం ప్రశాంతంగా ముగిసింది. గురువారం స్థానిక జైకిసాన్ పార్కులో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన పురపాలక సంఘం సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గిత్తా జయసూర్య హాజరయ్యారు. ముందుగా సీనియర్ అసిస్టెంట్ అజెండాలోని అంశాలను వివరించారు. 2వ వార్డు కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్ తన వార్డులో జంతువధశాల లేక పోవడంతో రోడ్లపైనే జంతువులను కోయడం వలన స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని, విద్యుత్ స్థంబాలు ఏర్పాటు చేయలన్నారు. టేబుల్ అజెండాలో తీసుకున్న అంశాలకు సభ్యులు అమోదం తెలుపకున్న మినిట్స్ బుక్ ఎలా రాస్తారని ఆయన ప్రశ్నించారు. కౌన్సిలర్ బాస్కర్‌రెడ్డి మాట్లాడుతు గత



11 నెలలుగా సమ్మర్ స్టోరేజి నుండి త్రాగు నీరు రావడంలేదని, నీటిని నిల్వ చేయడంలేదని ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని, మున్సిపాల్టి నుండి లక్షల్లో కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లిస్తున్నారని ఆరోపించారు. దీంతో స్పంధించిన ఎమ్మెల్యే రానున్న వేసివిని దృష్టిలో పెట్టుకొని వెంటనే చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇవ్వాలని ఇకపై మున్సిపాల్టి ఆధ్వర్యంలో మెయింట్‌నెన్స్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. డంప్ యార్డు వలన ఇబ్బందులు పడుతున్నామని 24వ వార్డు కౌన్సిలర్ తెలిపారు. పట్టణానికి రెండు కి.మీ దూరంలో ఉండాలని బిజినవేముల సమీపంలో ప్రభుత్వ భూమి ఉందని అక్కడ ఏర్పాటు చేసేలా పరిశీలించాలని ఎమ్మెల్యే అధికారులకు తెలిపారు. ప్రత్యేక నిధులు రూ.9 కోట్లు దారి మళ్ళించారా అవి ఏమయ్యాయని సభ్యులు ప్రశ్నించారు. పట్టణ సమీపంలో వేస్తున్న వెంచర్లపై అధికారులు వెంటనే స్పంధిస్తే మున్సిపాల్టి అదాయం వస్తుందని దీనిపై అధికారులు స్పంధించక పోవడంతో ఇష్టానుసారంగా వెంచర్లు వేస్తున్నారని, గతంలో వేసిన వెంచర్లపై కూడా విచారణ చేపట్టాలని కౌన్సిలర్ మందడివాణి డిమాండ్ చేశారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు ప్రతి నెల సభ్యులు సమావేశం జరిపి సమస్యలపై చర్చించాలని గత ప్రభుత్వంతో ఎక్కడ వేసన గొంగళి అక్కడే అన్నట్టుగా అభివృద్ధి కుంటుపడిందన్నారు. పట్టణ అభివృద్ధి కొరకు సభ్యులు అందరు సమిష్టిగా పని చేయాలని, మున్సిపాల్టి సమస్యలపై తనకు ఒక నివేదిక ఇవ్వాలని దానిపై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని పోతానని తెలిపారు. అనంతరం అజెండాలోని పలు అంశాలకు సభ్యులు అమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఎస్.బేబి, వైస్ చైర్మన్ మొల్ల రబ్బాని, వివిధ శాఖల అధికారులు, ఎలాంటి సంఘటనలు జరగకుండా పట్టణ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి గట్టి భంధోబస్తు ఏర్పాటు చేశారు.

# తాగునీటి సమస్య.. తలెత్తకుండా చూడాలి

**– అధికారులను ఆదేశించిన జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి**



**హాలహర్వి, జనవరి30, ప్రభాతవార్త;** రానున్న వేసవికాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని బాపురం రిజర్వాయర్‌ను ఆయన పరిశీలించారు. రిజర్వాయర్‌లో నీటి సామర్థ్యం, గ్రామాలకు తాగునీటి సరఫరా తదితర సమస్యలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఎల్‌సీ కాలువకు ఏప్రిల్ 10వ తేదీ వరకు నీరు ఉంటాయని, బాపురం, చింతకుంట గ్రామాల రిజర్వాయర్లను పూర్తి స్థాయిలో నీరు నిల్వ చేసుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. బాపురం రిజర్వాయర్ నుంచి 26 గ్రామాలకు, చింతకుంట నుంచి గ్రామాలకు 18 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుందని ఆయన తెలిపారు. ఎల్ఎల్‌సీ కాలువకు నీరు ఉన్నప్పుడే రిజర్వాయర్లకు నీరు నిల్వ చేసుకుని తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా బాపురం ఫిల్టర్‌బెడ్‌లో తాగునీరు కలుషిత కాకుండా ఫిల్టర్‌బెడ్‌లను శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. కలుషితమైన నీరు తాగడం వల్ల ప్రజలు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. నీరు ఫిల్టర్ చేసి కుళాయిలకు సరఫరా చేయాలని సూచించారు. అలాగే గ్రామాల్లో పైపులైన్ లీకేజీ మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు ప్రజలకు అందుబాబుటోల ఉండి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈయన వెంట డీఎల్‌డీఓ అనురాధ, ఎంపీడీఓ వరలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరమణి, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ కార్యదర్శులు అహ్మద్‌అజీజ్, నిరంజన్‌కుమార్, మంజునాథ్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలదేవస్థానం ఈఓను కలసిన పీఠాధిపతి

**శ్రీశైలంప్రాజెక్టు, జనవరి30, ప్రబాతవార్త :**
శ్రీశైలదేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావును ఆయన కార్యలయంలో గురువారంనాడు చరిత్ర,సంస్కృతి,పురావస్తు శాస్త్ర పీఠం,పోట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం,శ్రీశైలప్రాంగణం పీఠాధిపతి ఎం.శ్రీనివాసరావు,మరియు భోదన,బోదనేతర సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసారు.ఈ సందర్బంగా విశ్వవిద్యాలయం 2025వసంవత్సరం కాలేండర్లను అందజేసారు.తదుపరి శ్రీశైల ప్రాంగణంలో అమలులో ఉన్న కోర్సులు,గ్రంధాలయం మరియు పరిశోదనలు,నిర్వహించిన సేమినార్లు, తదితర వంటివాటి గురించి ఈఓ అడిగితెలుసుకున్నారు.అంతేకాక క్షేత్ర దర్శనానికి వచ్చే యాత్రిక,భక్త సందర్శకులందరికి దేవాలయపరమైన నిర్మాణ విశేషాలు,ఆధ్యాత్మిక సమాచారం తెలుపడానికి గైడ్‌లను ఏర్పాటు చేయడం గురించి కూడా చర్చించారు.ఈ కార్యక్రమంలో డా.డి.విశ్వనాధశాస్త్రి,అసిస్టెంట్ ప్రోఫెసర్ డా.పి.మురళీధర్‌రెడ్డి, మూ ్యజియం కన్సర్వేటర్ సి.రమేస్ బాబు,జూనియర్ అసిస్టెంట్ కె.బాబు,వర్కఇన్స్‌పేక్టర్ తదితరులు పాల్గోన్నారు.

## నందికొట్కూరు వైకాపా మహిళా విభాగం అధ్యక్షురాలుగా.. తమ్మిదల ఉషా సర్వేశ్వర్ రెడ్డి

**మిడుతూరు జనవరి 30 ప్రభాతవార్త:**



నందికొట్కూరు నియోజకవర్గ వైకాపా మహిళ విభాగం అధ్యక్షురాలుగా నాగలూటి గ్రామ సర్పంచ్ తమ్మిదల ఉషా సర్వేశ్వర్ రెడ్డి ఎంపికయింది. మిడుతూరు మండల నాగ లూటీ గ్రామ సర్పంచ్ గా ఆమె కొనసాగుతున్నారు. అదేవిధంగా చింతలపల్లి గ్రామానికి చెందిన మల్లేశ్వర్ రెడ్డి నందికొట్కూరు నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. మాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ కోసం, ప్రజల అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తామని నాపై నమ్మకంతో ఈ పదవులకు మమ్ములను ఎంపిక చేసినందుకు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి, మాజీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి, నందికొట్కూరు వైకాపా సమన్వయకర్త దారా సుధీర్ కు కృతజ్ఞతలు అని సర్పంచ్ తమ్మిదల ఉషా సర్వేశ్వర్ రెడ్డి, మల్లేశ్వర్ రెడ్డి లు అన్నారు.

## మద్యం దుకాణం కోసం దరఖాస్తులు

**కోసిగి, జనవరి 30, ప్రభాతవార్త**



గీత కులాలకు రిజర్వు చేసిన మద్యం దుకాణంకు ఉపకులాల వారిగా దరఖాస్తు చేసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ భార్గవరెడ్డి తెలిపారు..గురువారం ఎక్సైజ్ సిఐ భార్గవరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ కోసిగి ఎక్సైజ్ స్టేషన్ పరిదిలోని కోసిగి మండలానికి సంబందించ ఒక మద్యం దుకాణాన్ని ఈడిగ ఉపకులానికి కేటాయించడం జరిగిందన్నారు.. ఈ మద్యం దుకాణం కోసం దరఖాస్తుచేయాలనుకునే వారు రూ.2 లక్షల దరఖాస్తు రుసుంను చెల్లించాల్సి ఉంటుందన్నారు..కాగా దరఖాస్తులు ఆన్‌లైన్‌లోనే స్వీకరించబడుతాయన్నారు.. ఈ దరఖాస్తుకు చివరి తేది ఫిబ్రవరి 5 వరకు ఉంటుందని, అనంతరం 7వ తేదిన దరఖాస్తు డ్రా ఉంటుందన్నారు..ముఖ్యంగా ఈడిగ ఉపకులానికి కేటాయించబడిన మద్యం దుకాణంకు కేవలం ఈడిగ ఉపకులానికి చెందిన వారే మాత్రమే అర్హులన్నారు..

## గీతా కార్మికులు మద్యం టెండర్లను వినియోగించుకోండి

**: నంద్యాల జిల్లా ఎక్సైంజ్ శాఖ అసిస్టేంట్ సూపరిడెంట్ రాముడు**



**ఆత్మకూరు,జనవరి30, ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం గీతా కార్మికులకు సబ్సీడి అందించే విదంగా మద్యం టెండర్లకు నోటిఫికేషన్ జారీ చేసిన విషయం అందరికి తెలిసిందేనని నంద్యాల జిల్లా ఎక్సైంజ్‌శాఖ అసిస్టేంట్ సూపరిడెంట్ రాముడు తెలిపారు. గురువారం ఎక్సైంజ్‌శాఖ కార్యాలయంలో ఆత్మకూరు ఎక్సైంజ్ సిఐ కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూపరిడెంట్ రాముడు మాట్లాడుతూ నంద్యాల జిల్లా పరిధిలో మొత్తం 11 షాఫ్‌లను కేటాయించడం జరిగిందని గుర్తు చేశారు. అందులో ఆత్మకూరు ఎక్సైంజ్‌శాఖ డివిజన్ పరిధిలో 3షాప్‌లు మంజూరు కాగా అయిన మద్యం షాప్‌లను సద్వినియోగం చేసుకునే విదంగా గౌడు, గౌడ్స్, ఈడిగ ఉప కులాల వారు టెండర్లకు రావాలని పిలుపు నిచ్చారు. మద్యం టెండర్లలో పాల్గోనే వ్యక్తులు తప్పని సరిగ్గా రూ.2లక్షలు ప్రభుత్వానికి చలాన చెల్లించాలని వివరించారు. ఫిబ్రవరి 5వతేదిన సాయంత్రం 5గంటల వరకు ఆత్మకూరు ఎక్సైజ్ కార్యాలయంలో ధరఖాస్తులు స్వీకరించబడతాయని అన్నారు. తప్పుడు కుల ధృవీకరణ పత్రాలు తీసుకోని వస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయక తప్పదని వివరించారు. టెండరులలో కేవలం నంద్యాల జిల్లాకు చెందిన వ్యక్తులు పాల్గోన్నాలన్నారు. మండల తహశీల్దార్‌ల నుంచి కులధృవీకరణ పత్రాలను కొత్తగా తీసుకోని రావాలన్నారు. ఫిబ్రవరి 7వతేదిన టెండరుల పాల్గోనే వారికి జిల్లా కలెక్టర్ రాజాకుమారి ఘనియా, ఎక్సైంజ్ శాఖ జిల్లా సూపరిడెంట్ రవికుమార్, ఎస్పీ ఆదిరాజ్‌సింగ్‌రాణా ఆధ్వర్యంలో టెండరులను డ్రిప్ ద్వారా తీయడం జరుగుతుందన్నారు. ఆత్మకూరు సర్కిల్ పరిధిలోని మున్సిపాలిటి 1,కొత్తపల్లి1, పాములపాడు1 మూడు సబ్ కులాల వారిగా మద్యం దుఖాణాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఎక్సైంజ్ ఇన్‌స్పెక్టర్ వీరాస్వామి,సిబ్బంది,తదితరులు పాల్గోన్నారు.

# బాల్యవివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమిష్టి కృషి చేయండి

**నంద్యాల, జనవరి 30, ప్రభాతవార్తప్రతినిధి**




జిల్లాలో బాల్యవివాహాల నియంత్రణకు అన్ని ప్రభుత్వం శాఖలు సమిష్టి కృషితోనియంత్రించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్త్రీశిశుసంక్షేమ శాఖ సంచాలకు వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. గురువారము నంద్యాల పట్టణం ఎన్‌జిఒస్ కాలనీలోనా కోఅపరెట్యూ ఫంక్షన్ హాల్‌లో బాల్యవివాహాల నియంత్రణ కిశోరు వికాసం మిషన వాత్సల్య తదితర కార్యక్రమాలపై అన్ని శాఖలతో వర్క్‌షాప్ నిర్వహించారు. జిల్లా కలెక్టరు రాజకుమారి, యూనిసెఫ్ బాలల రక్షణ అబివృద్ధి అదికారి మురళీకృష్ణ అర్డివోలు అన్ని శాఖల ఉన్నతాదికారులు పాల్గొన్నారు. ఈసందర్బముగా స్త్రీ శిశుసంక్షేమ శాఖ సంచాలకులు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నంద్యాల జిల్లాను బాల్యవివాహాల రహిత జిల్లాగా మార్చేందుకు స్త్రీశిశు సంక్షేమ శాఖతో పాటు అన్ని శాఖలు సమిష్టిగా సమర్దవంతంగా కృషి చేస్తేనే సాధ్యమవుతుందన్నారు. జిల్లాలో బాల్యవివాహాలు టీనేజ్ ప్రెగ్నెన్సీ అదికముగా ఉన్న నేపద్యములో రాష్ట్ర ముఖ్యమంత్రి అన్ని జిల్లాలలో వర్క్ షాప్‌లు నిర్వహించి బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలన్నారు.స్వరాంద్రా 2047 లక్ష్యసాదనకు ప్రదాన అడ్డంకిగా ఉన్న బాల్యవివాహాల నియంత్రన టీనేజ్ ప్రెగ్నెన్సీని అరికట్టాలన్నారు.స్త్రీశిశుసంక్షేమ శాఖ స్థాపించబడి 50సంవత్సరాలు అయినప్పటికి కొరతగా వున్న మౌళిక సదుపాయాలను సమకూర్చుకుంటూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో టాయిలెటుల్ల త్రాగునీరు, విద్యుత్ పరికరాలు తదితర మౌళిక వసతుల కొరకు 52కోట్లు విడుదల చేసి పూర్తి చేశామన్నారు. ఏ రాష్ట్రంలో లేని విదముగా బలవర్దకమైన పౌష్టిక అహారాన్ని చంటి పిల్లలకు గర్భిణీ స్త్రీలు బాలింతలకు అందిస్తున్నామన్నారు. మిషన్ వాత్సల్యలో బాగంగా 8నుంచి 14సంవత్సరాలు లోపు పిల్లల వరకు ఎలాంటి ఇబ్బందులు లేవని 15నుంచి 17సంవత్సరాలలోనా కిశోరు బాలికలు చదువుమధ్యలోనే మానేయడము కారణంగా అతి పిన్నవయస్సులోనే పెళ్లిళ్ల జరిగి అరోగ్యసమస్యలను కొని తెచ్చుకుంటున్న నేపద్యములో అరికట్టాల్సిన బాద్యత మనందిరపై ఉందన్నారు. మహిళ అరోగ్యంగా ఉంటేనే కుటుంబం సంతోషముగా ఉంటుందని తద్వారా పిల్లలు కూడా అరోగ్యముగ ఉంటారని సూచించారు. బాల్యవివాహాలలో జరిగే అనర్థాలపై తల్లిదండ్రులకు సంపూర్ణ అవగాహణ కల్పించడంతో పాటు చట్ట వ్యలతిరేక చర్యలు కింద రెండు సంవత్సకరాల జైలు శిక్ష లక్ష రూపాయలు జరిమాన విగిస్తారన్న విషయాలన్ని విస్తృతంగా అవగాహణ కల్పించాలన్నారు. సామాజిక కార్యక్రమం కింద బాల్యవివాహాల నియంత్రణకు అంకితబావముతో పని చేయాలన్నారు. కలెక్టరు మాట్లాడుతూ బాల్య వివాహాల నియంత్రణకు రెవెన్యూ పోలీసు,మెడికల్ అండ్ హెత్ స్త్రీశిశు సంక్షేమ శాఖలు ప్రదాన బాద్యతగా తీసుకోవాలన్నారు. జిల్లాలోని 1663అంగన్‌వాడీ కేంద్రాలలో 33శాతము పిల్లలు వయస్సుకు తగ్గ బరువు ఎత్తు లేకుండా ఉన్నారన్నారు.గత అరు నెలల కాలం నుండి ప్రత్యేకశ్రర్ధ పెట్టిబలమైన పోషకఅహారాన్ని ఇవ్వడము వల్ల కొంతమేర అదికమించామన్నారు. జిల్లాలో బాల్యవివాహాల నియంత్రణకు గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు కమిటీలు ఏర్పాటుచేసి ప్రత్యేక శ్ర తీసుకుంటున్నట్లు కలెక్టరు తెలిపారు. క్షేత్రస్థాయిలోసచివాలయ సిబ్బంది అవావర్కర్లు అంగన్‌వాడీకార్యకర్తలుబాల్యవివాహాలు జరుగుతునప్పుడు సమాచారము ఇవ్వడమే కాకుండా గత 15రోజుల నుఎండి నిర్వహించే కార్యకలాపాలపై దృష్టి సారించి నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. టగత అరు నెలలనుండి మాతృశిశుమరణాలు కూడా తగ్గించగలిగామని కలెక్టరు చెప్పారు. మద్యలో చదువు మానేసిన అమ్మాయిల తల్లిదండ్రులను ప్రోత్సహించి కేజీబివి విద్యాలయాల్లో చేర్పించేందుకు విద్యాశాఖ అదికారులు కృషి చేయాలన్నారు. అనంతరము యూనిసెఫ్ ప్రతినిది మురళీకృష్ణ పవర్ పాయింట్ ప్రెజెంటేషన ద్వారా బాల్యవివామాల నియంత్రణపై వివరించారు.ఈసమావేశములో ఐసిడియస్ పిడి లీలావతి, అర్డివోలు విశ్వనాద్ నరసింహులునాగజ్యోతి జిల్లా పసరిషత్ డిప్యుటి సిఈఓ జనార్ధనరెడ్డి డియంహెచ్ఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

## మిడుతూరు ఎత్తిపోతల పథకంపై సీఎం చంద్రబాబు హామీ..



**మిడుతూరు జనవరి 30 ప్రభాతవార్త:**
ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న మిడుతూరు ఎత్తిపోతల పథకం అమలుపై రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చాడని మండల టిడిపి కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి అన్నారు. సీఎం క్యాంపు ఆఫీసులో నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య, నేను కలిసి సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి మిడుతూరు ఎత్తిపోతల పథకం గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. గతంలో కర్నూలు జిల్లా పర్యటనలో, నంద్యాల పర్యటనలో, నందికొట్కూరు పర్యటనలో, యువగలం పాదయాత్రలో సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లు ఎత్తిపోతల పథకంపై హామీ ఇచ్చారని వారి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ముఖ్యంగా మండలంలో వేలాది ఎకరాలు వర్షాధారంపైనే ఆధారపడి ఉందని ఎలాంటి సాగునీటి సౌకర్యాలు లేవని దీంతో ప్రతి ఏడాది వర్షాభావం వల్ల రైతులు ఏదో ఒక పంటలో నష్టం చూడాల్సిన పరిస్థితి వస్తుందని, ఎత్తిపోతల పథకం మంజూరు చేస్తే పంటలో ఒకటి లేదా రెండు తడులు మీరు కట్టుకొని పంటలు నష్టపోకుండా ఉంటాయని సీఎంతో చెప్పడం జరిగిందన్నారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందిస్తూ త్వరలో ఎత్తిపోతల పథకం మంజూరుకు హామీ ఇచ్చారని కాతా రమేష్ రెడ్డి అన్నారు.

## చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

**– డిఎస్పీ ప్రమోద్**



**ఆళ్లగడ్డ, జనవరి 30, ప్రభాతవార్తః**
ఆళ్లగడ్డ పరిసర ప్రాంతాల్లో ఏవరైనా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆళ్లగడ్డ డిఎస్పీ కొలికపూడి ప్రమోద్ తెలిపారు. గురువారం ఆళ్లగడ్డ టౌన్ పోలీస్‌స్టేషన్ నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డలో 30యాక్టు అమలులో ఉందని ర్యాలీలు సభలు నిరోదించడమైందన్నారు. ముఖ్యమైన ర్యాలీలకు, సభలకు డిఎస్పీ కార్యాలయం నుండి అనుమతులు తీసుకోవాలన్నారు. అలాగే అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడినా, పాలుపంపులు పొందినా చర్యలు తప్పవన్నారు. మీ పరిసర ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు, రౌడి మూఖలు సంచరిస్తే పోలీసులకు తెలియజేయలన్నారు. ఏవరైనా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పట్టణ సిఐ చిరంజీవి, రూరల్ సిఐ మురళీధర్‌రెడ్డి, పట్టణ ఎస్ఐ నగినా, రూరల్ ఎస్ఐ హరిప్రసాద్, పోలీస్‌సిబ్బంది స్పెషల్ ఫోర్స్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీజీ అడుగుజాడల్లో.. నేటి యువతరం ముందుకెళ్లాలి




**కర్నూలు హాస్పిటల్, జనవరి 30, ప్రభాతవార్తః**
గాంధీజీ అడుగుజాడల్లో నేటి యువతరం ముందుకెళ్లాలని కర్నూలు పార్లమెంటు జిల్లా అధ్యక్షులు పి తిక్కారెడ్డి అన్నారు. గురువారం గాంధీజీ వర్థంతిని పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఇతర నాయకులు, కార్యకర్తలతో కలిసి మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతదేశానికి వ్యాపారం కోసం వచ్చిన ఆంగ్లేయులు చిన్న చిన్నగా వారి సామ్రాజ్యాన్ని విస్తరింపచేసుకొని భారతీయులను ఎన్నో ఇబ్బందులుపెట్టి చిత్రహింసలకు గురిచేస్తున్న సమయంలో వారి పాలన నుండి స్వతంత్ర్య భారతావని కోసం ఎంతోమంది పోరాటాలు సాగించారని వారిలో మహాత్ముడు ఒకరని కొనియాడారు. దేశ స్వాతంత్ర్యాన్ని సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగేంద్రకుమార్, దాశెట్టి శ్రీనివాసులు, ఎస్ నవీన్, జె తిరుపాల్‌బాబు, బొగ్గుల ప్రవీన్, రెడ్డిపోగు బజారప్ప, సత్రం రామకృష్ణుడు, ధరూర్ జేమ్స్, పి హనుమంతరావు చౌదరి, యల్‌వి ప్రసాద్, అఖీల్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

## ఆరాధనోత్సవాల్లో ఎమ్మెల్యే విరుపాక్షి



**ఆస్పరి,జనవరి 30,ప్రభాతవార్త**
మండల పరిధిలోని తంగరడోన గ్రామంలో వెలుగొందుతున్న శ్రీశ్రీ చింతలాముని,నల్లారెడ్డి స్వాముల వారి 35వ ఆరాధన మహోత్సవాలను పురస్కరించుకుని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్థానిక వైసిపి నాయకులు మేళతాళాలు,పూలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమె ్మల్యే బుసినే విరుపాక్షి మాట్లాడుతూ రాబోవు కాలంలో వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండి రైతులు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శంకరమ్మ,గ్రామపెద్దలు సీతారామిరెడ్డి,గోపాల్‌రెడ్డి,వెంకన్న,పులికొండ రంగన్న, సచివాలయ కన్వీనర్ రాజన్న,గ్రామ నాయకులు మునిస్వామి, దస్తగిరి, వెంకటేష్,రంగముని,పాండు,వైకాపా మండల కన్వీనర్ బసవరాజు,ఎంపిపి సుంకర ఉమాదేవి భర్త రామాంజనేయులు,మాజీ సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన్, నియోజకవర్గ వింగ్ తాలుక అధ్యక్షులు అశోక్,మసాల ప్రకాష్,సర్పంచ్ వెంకటేష్,లక్ష్మన్న,కౌలుట్ల,శివ,చిన్నాయప్ప,కన్నా,ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అందరి మన్ననలు పొందిన తెలుగు జాతీయ దినపత్రిక వార్త

**– పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి**

**: 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి..**



**వెల్దుర్తి,జనవరి30,ప్రభాతవార్త**
అన్ని వర్గాల ప్రజల సమస్యలను ప్రభుత్వం,ప్రజాప్రతినిధులు,అధికారుల దృష్టికి తీసుకుపోయి అందరి మన్ననలు పొందిన తెలుగు జాతీయ దినపత్రిక వార్త అని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి అన్నారు.కర్నూలులోని ఆమె స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి,రాష్ట్ర వైకాపా కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి,వైకాపా నాయకులతో కలిసి వార్త తెలుగు దినపత్రిక–2025 నూతన క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు.ఈ సందర్బంగా మాజీ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచి ప్రజల సమస్యల పరిష్కారానికి తమ వంతు పాత్ర పోషించిన వార్త తెలుగు జాతీయ దినపత్రిక యాజమాన్యానికి, పాత్రికేయులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవితో రాష్ట్ర వైకాపా కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి,వైకాపా నాయకులు వైకాపా నాయకులు పుల్లగుమ్మి నాగార్జునరెడ్డి,అల్లుగుండు శ్రీరాంరెడ్డి,క్రిష్ణగిరి ఆర్‌బి.వెంకటరాముడు, మల్లికార్జునరెడ్డి,అమర్‌నాథ్‌రెడ్డి,కలుగోట్ల రామాంజనేయులు,వార్త పత్రిక పాత్రికేయుడు షేక్.అమీర్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలపై ముఖ్యమంత్రి యూటర్న్ తీసుకోవడం దారుణం

- **అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు**
- **సిఎంతోపాటు డిప్యూటీ సిఎం,లోకేష్ సమాధానం చెప్పాలి**
- **మంత్రాలయం ఎంఎల్‌ఏ వై.బాలనాగిరెడ్డి**



**మంత్రాలయం,జనవరి 30,ప్రభాతవార్త:**
రాష్ట్రప్రజలకు అందిస్తామన్న సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యూటర్న్ తీసుకోవడం చాలా దారుణమని మంత్రాలయం ఎంఎల్‌ఏ వై.బాల నాగిరెడ్డి అన్నారు.గురువారం రాంపురంలోని తమ స్వగృహంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్బ:గా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అబద్ధపు హామీలు ఇచ్చి చంద్రబాబు గద్దెనెక్కారని విమర్శించారు.అర్హులకు పెన ్షన్,ఆడబిడ్డ నిధి,రైతుభరోసా,మహిళలకు ఉచితబస్సు తదితర ఆరు సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తామని ప్రజలకు హామీఇచ్చి ఎన్నికల్లో గెలిచారన్నారు.అయితే ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు కావస్తున్నా ఏఒక్క సంక్షేమ పథకం ప్రజలకు అందలేదన్నారు. కేవలంపెన ్షన్‌లు మాత్రం అందజేసి నెలానెలా పబ్లిసిటీ చేసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో కూడా కొంతమంది పెన ్షన్‌లు తొలగిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. ఇప్పటికైనా సంక్షేమ పథకాల అమలుపై సిఎం,డిప్యూటీసిఎం, నారాలోకేష్‌లు ప్రజలకు వివరణ ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి, లోకేష్‌లుదావోస్‌కు వెళ్ళి ఎన్ని పెట్టుబడులు తెచ్చారో తెలియజేయాలన్నారు. రాష్ట్రంలోని 17 మెడికల్ కళాశాలల నిర్మాణాలను ప్రభుత్వం నిలిపివేసిందన్నారు.ఆఖరికి మీరాజకీయానికి తిరుపతి వెంకటేశ్వరస్వామిని కూడా వాడుకు న్నారన్నారు. ప్రభుత్వ అధికారులు కూడా పనులను వన్‌సైడ్ చేయడం మానుకోవాలన్నారు. రాష్ట్రంలో సంపద సృష్టిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి నేటివరకు ఎంతసంపద సృష్టించారో స్పష్టం చేయాలన్నారు.సంక్షేమ పథకాల అమలుకు నిధులు లేవని చెబుతున్న ముఖ్యమంత్రి 2014–19 వరకు జరిగిన నీరు–చెట్టు పనులకు బిల్లులు చెల్లించడానికి నిధులు ఎలా వచ్చాయన్నారు.ఇవన్నీ రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు గుర్రెడ్డి భీంరెడ్డి, పెద్దకడబూరు నాయకులు పురుషోత్తంరెడ్డి, మురళిరెడ్డి ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.